ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కడప
జిల్లా వార్తలు
5
శుక్రవారం 27 జూన్ 2025

మేం ఇక్కడే ఉంటాం..!

- బదిలీ చేయవద్దంటున్న సచివాలయ సిబ్బంది
- నాడు వైసీపీతో అంటకాగిన ఉద్యోగులు
- నేడు ఇక్కడే తిష్టవేసేందుకు ఎత్తులు
- తలలు పట్టుకుంటున్న నేతలు



చెన్నూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి అధికారులైతే రెండేళ్లు, మండల స్థాయి అధికారులైతే మూడేళ్లు, కిందిస్థాయి ఉద్యోగులైతే ఐదేళ్లు పూర్తి కాగానే ప్రభుత్వం తప్పనిసరిగా బదిలీ చేస్తుంటుంది. ఇందుకు బదిలీల మార్గదర్శకాలున్నాయి. అయితే కొందరు సచివాలయ ఉద్యోగులు జగన్ హయాంలో వైసీపీతో అంటకాగి ఎలాగైనా ఇక్కడే ఉండాలన్న ఆలోచనతో ప్రస్తుతం పనిచేస్తున్న మండలంలోనే మరో సచివాలయానికి బదిలీ చేయించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి వారు మరలా ఇక్కడే కొనసాగేందుకు ఎత్తులు వేస్తున్నారు. ఈ మేరకు నేతలు, ప్రజాప్రతినిధుల వద్ద నుంచి సిఫారసు లేఖలు తెచ్చుకుంటున్నారు.

కీలకమైన పోస్టుల్లో వైసీపీ అనుకూలురు

ప్రతి సచివాయంలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, ఏఎన్ఎం, మహిళా పోలీసు, ఇంజనీరింగ్ అసిస్టెంటు, విలేజీ అగ్రికల్చర్ అసిస్టెంటు, డిజిటల్ అసిస్టెంటు, వెల్ఫేర్ అసిస్టెంటు, సర్వేయరు, ఎనర్జీ అసిస్టెంటు పోస్టులున్నాయి. వీటిలో పంచాయతీ కార్యదర్శి, విలేజీ అగ్రికల్చర్ అసిస్టెంటు, డిజిటల్ అసిస్టెంటు, వెల్ఫేర్ అసిస్టెంటు, సర్వేయరు పోస్టులు కీలకం. అలాంటి పోస్టుల్లో పనిచేసిన కొందరు గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నేతలకే పూర్తి సహకారం అందించారు. ఇప్పుడు వీరు అదే మండలంలో మరో సచివాలయానికి బదిలీ అయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనికి వైసీపీ నుంచి ప్రస్తుతం టీడీపీలోకి వచ్చిన నాయకులు సహకారం అందిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

పెరిగిన పోటీ

వార్డు, గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో కొందరు ఇతర ఉద్యోగాలకు వెళ్లారు. కూటమి ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా సచివాలయాల్లో సిబ్బందిని సర్దుబాటు చేస్తోంది. జిల్లాలో 645 సచివాలయాల్లో ఉన్న 5,707 మంది సిబ్బందిలో ఏ ఒక్కరినీ తొలగించలేదు. సర్దుబాటు మాత్రమే జరుగుతోంది. ఫలితంగా పోస్టులకు గిరాకీ పెరిగింది. ఇప్పుడు పనిచేసే మండలంలోనే మరో సచివాలయంలో పనిచేసేందుకు తమ నాయకులపై వత్తిడి పెట్టడంతో ఆ పోస్టులకు మరింత పోటీ పెరిగింది. వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన నేతలు మాత్రం తమ మాట ఎలాగైనా సరే నెగ్గించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఐదేళ్లు ఒకేచోట పనిచేసిన వారిని మరో మండలానికి బదిలీ చేస్తారా, లేక నాయకుల వత్తిళ్లతో ఇదే మండలంలోని మరో సచివాలయానికి మారుస్తారా అన్నది మరోవారంలో తేలనుంది. కాగా ఐదేళ్లు కాస్త దూరం మండలాల్లో పనిచేసి కుటుంబ సభ్యులకు ముఖ్యంగా చిన్నబిడ్డలకు దూరంగా ఉన్న మహిళలు, ప్రస్తుతం గర్భవతులు, బాలింతలుగా ఉన్న వారు మాత్రం తమను సొంత మండలానికి కేటాయిస్తారనే ఆశతో ఎదురుచూస్తున్నారు. మరి బదిలీలు పారదర్శకంగా జరుగుతాయా లేక వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన వారి సిఫారసులకే ప్రాధాన్యం ఇస్తారా అనేది త్వరలో తేలనుంది.

అభయమిస్తున్న నేతలు

"గతంలో మీరు అందించిన సహకారం ఎలా మరిచిపోతాం, మాకు గుర్తుందిలే. మేం పార్టీ మారినంత మాత్రాన మిమ్మల్ని వదులుకుంటామా. మాకు, మేం చెప్పిన వారికి పనులు కావాలంటే మీరుండాల కదా.. మిమ్మల్ని ఎందుకు వదులుకుంటామబ్బా. మా తిప్పలేవో మేం పడతాం.. ఇక్కడే ఇదే మండలంలో మరో సచివాలయంలో ఉండేలా చేస్తాం.." అని అప్పట్లో వైసీపీలో ఉండి ఇప్పుడు టీడీపీలోకి వచ్చిన నేతలు తమకు అనుకూలమైన సచివాలయ సిబ్బందికి అభయమిస్తున్నారు. వీరి వ్యవహారం పార్టీలో ముందు నుంచి ఉన్న సీనియర్ టీడీపీ నేతలకు తలనొప్పిగా మారింది.

ఖైదీల బ్యారక్ సమీపంలో సెల్‌ఫోను

కడప క్రైం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కడప సెంట్రల్ జైలులో ఖైదీల వద్ద నుంచి తరచూ సెల్‌ఫోన్లు దొరుకుతున్నాయి. రెండురోజుల క్రితం చిత్రావతి బ్యారక్ సమీపంలో సెల్‌ఫోనును గుర్తించారు. దీనిపై రిమ్స్ పోలీసుస్టేషన్‌లో జైలు అధికారులు ఫిర్యాదు చేశారు. జైలు అధికారులు కట్టుదిట్టంగా తనిఖీలు చేస్తున్నామని చెప్పినప్పటికీ మళ్లీ ఖైదీలున్న బ్యారక్ ప్రాంతాల్లో సెల్‌ఫోను దొరకడం అనుమానాలకు తావిస్తోంది. జైలులో సెల్‌పోను దొరకడంపై పర్యవేక్షణ అధికారి రాజేశ్వర్‌రావును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా, బ్యారక్ సమీప ఆవరణంలో శుభ్రపరుస్తున్న సమయంలో పాత పనికిరాని ఫోను దొరికిందని అన్నారు.

న్యాయం చేయండి

నందలూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): భర్తతో తనను కలిపి న్యాయం చేయాలంటూ ఓ మహిళ భర్త ఇంటి ముందు తండ్రితో కలిసి బైఠాయించిన సంఘటన గురువారం నందలూరులో జరిగింది. బాధితురాలి కథనం మేరకు... మండలంలోని అరవపల్లెకు చెందిన దేవేంద్రప్రసాద్‌కు వేంపల్లెకు చెందిన శారదతో 2014లో వివాహమైంది. 2018లో అత్తాకోడళ్ల మధ్య మనస్పర్థలు రావడంతో శారద పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో ఆమె భర్త ప్రసాద్ తన భార్య ఆరోగ్యం సరిగా లేదంటూ కోర్టును ఆశ్రయించి 2021లో విడాకులు తీసుకున్నారు. ఈ విషయం తెలిసి శారద రాజంపేట కోర్టును ఆశ్రయించడంతో గత ఏడాది జూలైలో విడాకులను రద్దు చేసింది. అప్పటి నుంచి తన భర్తను కలవాలని ప్రయత్నిస్తుంటే అత్తగారింటికి రానివ్వటం లేదు. దీంతో ఈమె గురువారం భర్త ఇంటి ముందు బైఠాయించింది.

డీకేటీ భూములపై విచారణ చేపట్టాలి

- కలెక్టర్, ఎస్పీలకు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి లేఖ

కడప, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు కింద ముంపునకు గురైన కె.బొమ్మేపల్లె డీకేటీ భూములపై విచారణ చేపట్టాలని ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కలెక్టర్, ఎస్పీలకు గురువారం లేఖ రాశారు. కొంతమంది స్వార్థపరులు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం 2019 వ సంవత్సరంలో పరిహారం కోసం డీకేటీ పట్టాలు సృష్టించారని కె.బొమ్మేపల్లె, దొరువు గ్రామాలకు చెందిన రైతులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. అందుకు సంబంధించిన ఆధారాలను పరిశీలించిన అనంతరం వాస్తవం ఉన్నట్లు తనకు అనిపిస్తోందన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి కొండాపురం తహశీల్దార్ కార్యాలయంలో కొంతమంది ఉద్యోగుల పాత్ర కూడా ఉందని 3 సెప్టెంబర్ 2023 న క్రైమ్ నెం.86/2023 తాళ్లప్రొద్దుటూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదయిందన్నారు. అయినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటీ చార్జిషీట్లు దాఖలు కాలేదన్నారు. అప్పటి అధికార పార్టీకి చెందిన రాజకీయ నాయకులు, రెవెన్యూ అధికారులు కుట్రపన్ని నకిలీ పత్రాలు సృష్టించి మోసం చేసినట్లు సమాచారం ఉందన్నారు. దీనిపై లోకాయుక్తాలో కూడా రైతులు ఫిర్యాదు చేశారన్నారు. నకిలీ పత్రాలు సృష్టించడం, ప్రభుత్వ స్థలాల దుర్వినియోగం తీవ్రమైన నేరమని, క్రైమ్ నెంబర్ 86/2023 ను పరిశీలించి విచారణ చేపట్టి నిజమైన రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్, ఎస్పీలను ఎమ్మెల్యే కోరారు.

కడప రైల్వేస్టేషన్‌కు వందే భారత్ ట్రయల్ రన్



కడప ఎర్రముక్కపల్లె, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును కడప రైల్వేస్టేషన్ వరకు ట్రయల్ రన్ నిర్వహించారు. గురువారం రేణిగుంట-కడప, కడప-రేణిగుంట మధ్య 130 కిలోమీటర్ల వేగంతో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను నడిపారు. ఈ ట్రయల్ రన్ విజయవంతం కావడంతో త్వరలోనే ఈ మార్గంలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నడుపుతారని రైల్వే అధికారులు, ప్రజలు భావిస్తున్నారు. వందేభారత్ రైలు సెమి-హై స్పీడ్, ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్ రైలు. దీనిని భారతీయ రైల్వే నిర్వహిస్తోంది. కోస్తా, రాయలసీమ ప్రాంతాలకు అనుసంధానంగా అమరావతి నుంచి ఈ రైలు నడపాలని భావిస్తున్నారు. ఈ రైలు అనంతపురం లేదా తిరుపతి మీదుగా వెళ్లే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే కడప వరకు ట్రయల్ కూడా నిర్వహించారు. దీనిపై రైల్వే శాఖ నిర్ణయం తీసుకోవాల్సిఉంది.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం
- నిరుపేద రైతులకు అండగా గ్రామీణ ఉపాధిహామీ పథకం
- పండ్ల తోటల సాగుకు నెలాఖరు వరకు అవకాశం

7

2 నుంచి మహా గురుకులంలో తరగతులు

జ్యోతి క్షేత్రానికి మళ్లీ ఆగిన బస్సు

- నేటి నుంచి రాకపోకలు బంద్
- అటవీశాఖ అభ్యంతరమే కారణం
- ఆందోళనలో కాశినాయన భక్తులు



కాశినాయన, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అవధూత కాశిరెడ్డినాయన జ్యోతిక్షేత్రానికి బస్సులను శుక్రవారం నుంచి నిలుపుదల చేశారు. ఈమేరకు స్థానిక అటవీశాఖ అధికారులు గురువారం ఆర్టీసీ అధికారులకు సమాచారం ఇచ్చారు.

జ్యోతిక్షేత్రంలో ఆలయ నిర్వాహకులు అక్రమంగా నిర్మాణాలు చేశారంటూ 3 నెలల క్రితం కొన్ని భవనాలను అటవీశాఖ అధికారులు కూల్చివేశారు. దీనికితోడు ఆర్టీసీ బస్సు సర్వీసునూ ఆపేశారు. దీనిపై కాశినాయన భక్తులు తీవ్రంగా స్పందించడంతో రాష్ట్ర స్థాయిలోనే కాకుండా ఢిల్లీ స్థాయి దాకా వెళ్లింది. రాష్ట్ర, కేంద్ర చట్టసభల్లో చర్చకు వచ్చింది. జరిగిన సంఘటన దురదృష్టకరమని భక్తులు ఆందోళన చెందవద్దని ప్రభుత్వం తరుపున భక్తులకు క్షమాపణలు తెలియజేశారు. పడగొట్టిన కొన్ని నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సొంత ఖర్చులతో తన ప్రతినిధిని పంపి కట్టించి, బస్సును పునరుద్ధరించి భక్తులను శాంతింపచేశారు. కూటమి ప్రభుత్వం జ్యోతిక్షేత్రం అభివృద్ధికి కట్టుబడి ఉందని, కేంద్రం నుంచి అనుమతులు తెచ్చి అసంపూర్తిగా ఉన్న కాశినాయన గుడిని పూర్తిచేయిస్తామని జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, బద్వేలు మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ, కె.రితేశ్‌రెడ్డి తదితరులు జ్యోతిక్షేత్రానికి వచ్చి భక్తులకు హామీ ఇచ్చిపోయారు. ఇంతలో ఏమైందో ఏమోగాని తిరిగీ సమస్య మొదటికి వచ్చింది. బస్సులను జ్యోతి క్షేత్రానికి పంపించేది లేదని అటవీశాఖ అధికారులు అభ్యంతరం తెలపడంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు.


ఈ విషయంపై మైదుకూరు ఆర్టీసీ డిపో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మిని ఆంధ్రజ్యోతి వివరణకోరగా అటవీశాఖ అధికారులు అభ్యంతరం చెప్పడంతో జ్యోతిక్షేత్రానికి శుక్రవారం నుంచి బస్సు సర్వీసు రద్దు చేశామన్నారు. పోరుమామిళ్ల ఫారెస్ట్ రేంజర్ రఘునాథ రెడ్డిని వివరణ కోరగా.. రాష్ట్ర అటవీశాఖ ప్రధాన కార్యాలయం నుంచి అందిన ఆదేశాలమేరకు బస్సును జ్యోతి క్షేత్రానికి అనుమతించేది లేదని అన్నారు. దీనిపై కూటమి నాయకులు, పాలకులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.



ప్రొద్దుటూరులో 'నో డ్రగ్స్' ఆకారంలో విద్యార్థులు

డివిజన్ స్థాయిలో పరిపాలన

- డీడీవోల నియామకం
- కార్యాలయ అధిపతిగా డీడీవో
- చకచకా కార్యాలయాల ఏర్పాటు
- ఒకే గొడుగు కిందకు.. పంచాయతీరాజ్ శాఖలు



కడప రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పంచాయతి రాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. పంచాయతిరాజ్ శాఖలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి డివిజన్ స్థాయిలో పరిపాలన ప్రారంభించింది. ఈమేరకు రాష్ట్ర వ్యాప్తంగా 77 డివిజన్లలో డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(డీడీవో) పోస్టులను సృష్టిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. డివిజనల్ జిల్లా ప్రజాపరిషత్ (డీఎల్‌డీవో) కార్యాలయం, డివిజనల్ పంచాయతీ (డీఎల్‌పీవో) కార్యాలయం, డివిజనల్ డ్వామా (అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్) కార్యాలయాలను డివిజనల్ స్థాయి పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధిశాఖ పరిపాలన నియంత్రణలోకి తీసుకొచ్చింది. ఈ కార్యాలయాలను డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీస్ ప్రాంగణానికి మార్చాలని ఈ నెల 12వ తేదీన ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఇకనుంచి ఆ కార్యాలయాలు డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(డీడీవో) పరిధిలో పనిచేయనున్నాయి. డివిజనల్ స్థాయిలో పీఆర్ అండ్ ఆర్డీకి చెందిన అన్ని విభాగాలలో డీడీవోనే కార్యాలయ అధిపతిగా వ్యవహరించనున్నారు. డీడీవో తన పరిధిలోని ఆయా డివిజనల్ శాఖలను పర్యవేక్షిస్తూ కలెక్టర్ నియంత్రణలో పని చేయనున్నారు.

శుభపరిణామం



- మైథిలి, డీడీవో, కడప

రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి డివిజనల్ స్థాయిలో పరిపాలనను ప్రారంభించడం పల్లెసీమల ప్రగతికి శుభపరిణామం. కలెక్టర్ నియంత్రణలో పనిచేస్తూ డివిజనల్ స్థాయిలో కేటాయించిన అన్ని అభివృద్ధి, సంక్షేమ విధులను సమన్వయం చేయడం, సమీక్షించడం, పర్యవేక్షించి తద్వారా ప్రభుత్వ లక్ష్యసాధనకు పాటుపడతాం.

చకచకా కార్యాలయాల ఏర్పాటు

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాలోని కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల డివిజన్లలో డీడీవో కార్యాలయాల ఏర్పాటుకు జడ్పీ శాఖ చకచకా చర్యలు చేపడుతోంది. ఈ మేరకు జడ్పీ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీ కార్యాలయంలో కడప డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(డీడీవో) కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన పనులను డీడీవో మైథిలి పర్యవేక్షిస్తున్నారు. కడప డీఎల్‌పీవో, డ్వామా ఏపీడీ తదితరులతో కలిసి వారి కార్యాలయాల ఏర్పాట్లపై సమీక్షించారు. అలాగే జమ్మలమడుగు, బద్వేలు, పులివెందులలో కూడా డీడీవో కార్యాలయాల ఏర్పాటు పనులు చురుకుగా సాగుతున్నాయి.

డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

- జాయింట్ కలెక్టర్ అదితిసింగ్


డ్రగ్స్ నిర్మూలనపై చేపట్టిన ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆర్.మాధవి, చిత్రంలో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, ఎస్పీ అశోక్ కుమార్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తదితరులు

కడప ఎర్రముక్కపల్లె, జూన్ 26(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని, అందుకోసం ప్రతి ఒక్కరు కృషిచేయాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పిలుపునిచ్చారు. గురువారం 'నషాముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా జిల్లా యంత్రాంగం, ఈగల్ (ఎలైట్ యాంటీ-నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ వాకథాన్ ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌తో పాటు ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కడప స్టేట్ గెస్ట్ హౌస్ నుంచి సెవన్‌రోడ్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సే నోటు టు డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉందాం, విలువైన ప్రాణాలు కాపాడుకుందాం, వద్దు గంజాయి, వద్దు వ్యసనం, ఈ క్షణం నుంచే మార్పు వంటి స్లోగన్స్ ప్లకార్డులను యువత, విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను పూర్తిగా అరికట్టడం కోసం సమిష్టిగా కృషిచేయాలన్నారు. విద్యార్థుల వసతి గృహాలు, కాలేజీలు, పాఠశాలల్లో డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ దేశానికి వెన్నెముకలాంటి యువత డ్రగ్స్ బారిన పడకుండా మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి వాటికి దూరంగా ఉండాలన్నారు గంజాయి అమ్మకాలు, వినియోగాన్ని నిరోధించడానికి 1972 టోల్‌ఫ్రీ నెంబర్‌కి తెలియజేస్తే చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపి మాదకద్రవ్యాలను నిర్మూలించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అనంతరం కడప జిల్లాను మత్తుపదార్థాల రహితంగా తీర్చిదిద్దాలని మనసారా నిర్ణయించుకుంటున్నామంటూ అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రకాశ్‌బాబు, ప్రొహిబిషన్ అండ్‌ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు, కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, కడప కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ రాకేష్‌చంద్ర, జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారి కృష్ణకిషోర్, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, ఎన్.సుధాకర్, శ్రీనివాసరావు, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, ఈగల్ సిబ్బంది, విద్యార్థులు, ఎన్జీఓలు, మహిళలు పాల్గొన్నారు.


ర్యాలీగా వెళుతున్న దృశ్యం

టీడీపీ కార్యకర్తల కుమ్ములాట


రోడ్డుపై కొట్టుకుంటున్న టీడీపీ కార్యకర్తలు

కలసపాడు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కలసపాడు మండల టీడీపీ కార్యాలయంలో పార్టీ సంస్థాగత ఎన్నికలపై కార్యకర్తల అభిప్రాయ సేకరణ సందర్భంగా గురువారం టీడీపీలోని రెండు వర్గాల మధ్య కుమ్ములాట జరిగింది. పార్టీ కార్యాలయంలో ఒక వర్గం వారితో పరిశీలకుడు ఖాదర్‌బాషా మాట్లాడుతుండగా బయట తంబల్లపల్లె గ్రామ పంచాయతీకి చెదిన టీడీపీ రెబల్ నాయకుడు ప్రహ్లాదరెడ్డి, సీనియర్ టీడీపీ కార్యకర్త నారాయణరెడ్డిల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మధ్యలో టీడీపీ మండల సీనియర్ నేత సర్దిచెబుతుండగా ఆయనను నెట్టడంతో వివాదం తీవ్రమైంది. దీనితో ఒక్కసారిగా గొడవ తీవ్రమైంది. ప్రహ్లాదరెడ్డితో పాటు రాజుపాలెం గ్రామానికి చెందిన మాజీ డీలర్‌పై పిడిగుద్దులు కురిపిస్తూ రోడ్డుపైకి ఎక్కారు. ఇంతలో విషయం తెలుసుకున్న సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ తిమోతి అక్కడికి చేరుకున్నారు. ఇరువర్గాలను అక్కడ నుంచి పంపారు. ఘర్షణకు కారణమైన కొందరిని స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

జిల్లా మాజీ వైద్యాధికారి గోపాల్‌రెడ్డి మృతి


డాక్టర్ గోపాల్‌రెడ్డి (ఫైల్)

రాజంపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడపజిల్లా వైద్యాధికారి డాక్టర్ రాచంరెడ్డి గోపాల్‌రెడ్డి(84) అనారోగ్యంతో మృతిచెందారు. గురువారం ఆయన స్వగ్రామం ప్రొద్దుటూరులో అంత్యక్రియలు నిర్వహించారు. సుదీర్ఘకాలం సుమారు 20 ఏళ్లు రాజంపేటలో డాక్టర్‌గా, ఉప జిల్లా వైద్యాధికారిగా వివిధ హోదాల్లో పనిచేసి తదనంతరం పదోన్నతిపై జిల్లా వైద్యశాఖాధికారిగా పనిచేశారు. రాజంపేటలో సుదీర్ఘ కాలం పనిచేసిన సమయంలో పేదలకు వైద్యసేవలు అందించడంలో పేదల డాక్టర్‌గా గుర్తింపు పొందారు. రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని గ్రామాల్లో వైద్యసేవలు నిర్వహించి పేదల డాక్టర్‌గా గ్రామీణ ప్రాంతాల్లో అనేక ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి వైద్యం అందించారు. ప్రభుత్వం ప్రతియేడాది నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమంలో మంచి గుర్తింపు పొందారు. అదేవిధంగా అనేక సామాజిక రుగ్మతలు, సేవా కార్యక్రమాలపై అనేక కవితలు రాసి కవితాగోష్ఠులు నిర్వహించి ఉత్తమ రచయితగా అవార్డులు పొందారు. తన స్వగ్రామం ప్రొద్దుటూరు హౌసింగ్‌బోర్డు కాలనీలో నివాసం ఉంటూ పదవి విరమణ చేసిన తర్వాత రోటరీ సంస్థలో ఉచిత వైద్యం నిర్వహించారు. ఆయన ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో హైదరాబాదుకు తరలించిగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయన మృతిపట్ల రాజంపేట ఎన్జీవో సంఘ మాజీ అధ్యక్షుడు లావలూరు శ్రీనివాసులు, పెన్షనర్ల సంఘం నాయకులు లక్ష్మీనరసయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సానె శేఖర్, విశ్రాంత తహసీల్దారు యంకోబరావు, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో యువకుడు మృతి


హరీష్ (ఫైల్‌ఫొటో)

మదనపల్లెటౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. గురువారం బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ పత్రవారిపల్లెకు చెందిన కృష్ణమూర్తి కుమారుడు డి.హరీష్(24) ద్విచక్ర వాహనంలో పుంగనూరుకు వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి సొంత గ్రామానికి వెళుతుండగా మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీ బోయకొండ ఆర్చి వద్ద జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం హరీష్ వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హరీష్‌ను మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా ఈ ప్రమాదంలో మరో ద్విచక్ర వాహనంలో వస్తున్న పట్టణానికి చెందిన స్వామినాథన్(24) కూడా గాయపడ్డాడు. మదనపల్లె తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- రూ.15 లక్షల ఆస్తినష్టం


దెబ్బతిన్న ఇల్లు

రామాపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమై రూ.15 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు రాంచెన్నారెడ్డి వాపోయాడు. మండలంలోని బండపల్లి పంచాయతీ వెంకటరెడ్డిగారిపల్లెకు చెందిన రాంచెన్నారెడ్డి బుధవారం అర్ధరాత్రి ఇంట్లో జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు వ్యాపించి ఇంట్లోని వస్తువులు బూడిద పాలయ్యాయన్నారు. రెండు సోఫాలు, 40 పట్టుచీరలు, బంగారు రూ.1.50 లక్షల నగదు, రెండు డబుల్ కాట్ మంచాలు కాలి బూడిదయ్యాయన్నారు. లక్కిరెడ్డిపల్లె ఫైర్ స్టేషన్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే నష్టం జరిగిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు వాపోయారు.

బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ తదితరులు

తిరుమల, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నందలూరు సౌమ్యనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు, తాళ్లపాకలోని చెన్నకేశవస్వామి, సిద్ధేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి గురువారం ఆవిష్కరించారు. జూలై 4 నుంచి 13 వరకు నందలూరులో, జూలై 5 నుంచి 15 వరకు తాళ్లపాకలో బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు నటేష్, ప్రశాంతి పాల్గొన్నారు.

నన్నారి షరబత్.. ఔషధ గుణాలున్న పానీయం. ఎండాకాలంలో దీనికి మించిన ఉపశమనం ఇచ్చేది మరొకటి ఉండదు. రాయలసీమలోని నల్లమల తదితర అటవీ ప్రాంతాల్లో సహజ సిద్ధంగా నన్నారి వేర్లు లభిస్తాయి. ప్రస్తుతం అటవీ ప్రాంతాల్లో నన్నారి వేర్ల లభ్యత కష్టంగా మారడంతో తమిళనాడుతో పాటు ఇతర రాష్ట్రాల్లోని రైతుల దృష్టి నన్నారి సాగు వైపు మళ్లింది. తక్కువ నీటితో అధిక దిగుబడులు, మంచి ఆదాయం వస్తుండడంతో నన్నారి వేర్ల సాగు మారుమూల ప్రాంతాలకు విస్తరిస్తోంది. ములకలచెరువు మండలంలో కూడా ఓ రైతు నన్నారి పంట సాగు చేశాడు.

నన్నారి సాగు.. భలే బాగు

- తక్కువ నీటితోనే అధిక దిగుబడి
- ఎరువులు...పురుగుల మందు అవసరమే ఉండదు
- మూడేళ్ల తరువాత దిగుబడి


నన్నారి నారు

ములకలచెరువు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గం ములకలచెరువు మండలంలోని వేపూరికోట పంచాయతీ బంగారు వాండ్లపల్లెకు చెందిన రామిరెడ్డి మూడేళ్ల క్రితం ఐదు ఎకరాల్లో నన్నారి సాగు చేశాడు. రూ.5 లక్షలకు పైగా ఖర్చయింది. నారు నాటిన సమయంలో మాత్రమే కొంతవరకు ఎరువులు వాడాడు. పంట సాగు చేసిన మొదట్లో నెలకోసారి మొక్కలకు నీరందించేవాడు. వేసవిలో ఒకటిన్నర నెలలకొకసారి, తరువాత మూడు నెలలకొకసారి మాత్రమే నీరందించాడు. ప్రస్తుతం నన్నారి పంట కోతకు వచ్చింది. పంట సాగు చేసిన మూడేళ్ల తరువాత పదేళ్ల లోపు ఎప్పుడైనా దిగుబడి తీసుకోవచ్చు. పదేళ్ల వరకు వదిలేస్తే మరింత అధికంగా దిగుబడి పొందవచ్చు.

నష్టాల ఊసే లేదు..

నన్నారి పంట మూడేళ్ల తరువాత మూడు టన్నుల వరకు దిగుబడి వస్తుంది. పదేళ్ల లోపు తీసుకుంటే రెట్టింపు దిగుబడి వస్తుంది. వేసవిలో కేజీ నన్నారి వేర్లు రూ.500లకు పైగా పలుకుతుంది. నన్నారి సాగులో నష్టాలే రావని రైతులు అంటున్నారు. నన్నారి వేర్లకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుందని, వేసవిలో అయితే మంచి ధర పలుకుతుందని చెబుతున్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా నన్నారి వేర్లకు డిమాండ్ ఉంది. బయటి దేశాలకు కూడా ఎగుమతి అవుతుందని చెబుతున్నారు.

కలుపు తీసే పని మాత్రమే ..

పంట సాగు చేసిన మొదట్లో మాత్రమే పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఎప్పటికప్పుడు కలుపు తొలగించేందుకు కొంత ఖర్చవుతుంది. మేకలు, పశువులు నన్నారి ఆకులు తినవు కాబట్టి ఈ పంటకు కాపలా ఉండాల్సిన అవసరం కూడా ఉండదు


నన్నారి వేరు

కొత్త రకం పంటల సాగుపై ఆసక్తి



కొత్త రకం పంటల సాగుపై ఆసక్తితో పదేళ్ల కిందట బటన్ రోజా పూలు సాగు చేశా. మూడేళ్ల క్రితం నన్నారి సాగు చేశాను. మంచి ధర పలికినప్పుడు వేర్లు తీయించి విక్రయించాలని నిర్ణయించుకున్నాను. ఇటీవల ఓ రైతు సాగు చేసిన నన్నారి పంటను పరిశీలించాను. అతనికి మంచి దిగుబడి వచ్చింది.

\- రామిరెడ్డి, బంగారువాండ్లపల్లె

ప్రభుత్వాసుపత్రిలో పడకేసిన పారిశుధ్యం



వాడి పడేసిన మందులూ ఆసుపత్రి ఆవరణలోనే ఇలా... బాత్‌రూముల్లో అట్టముక్కలు వేసిన దృశ్యం

సిద్దవటం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం-1 పీహెచ్‌సీ ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుధ్యం పడకేసింది. ఆసుపత్రికి వచ్చే రోగులకు వ్యర్థాలతో కొత్త రోగాలు అంటుకుంటున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఆసుపత్రి ఆవరణం మొత్తం వ్యర్థాలతో దుర్వాసనలు వెదజల్లడంతో పాటు దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో రోగుల సహాయకులు సైతం అనారోగ్యం బారిన పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. ఆసుపత్రి ఆవరణంలో ఎక్కడపడితే అక్కడ కాలం చెల్లిన మందులు, సూదులను పడేశారు. డెలివరీ రూం, బాత్‌రూముల్లో అట్టపెట్టెలను పడేశారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు. ఈ విషయమై మాధవరం వైద్యాధికారి శివకుమార్‌ను వివరణ కోరగా ప్రాథమిక ఆరోగ్య పరిధి ప్రాంగణంలో ఉన్న అపరిశుభ్రతను పూర్తిగా తొలగించి డెలివరీ రూము, బాత్‌రూముల్లో ఉన్న అట్టముక్కలను తొలగిస్తామన్నారు. వైద్యశాలకు వచ్చిన రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేస్తామని వైద్యాధికారి తెలిపారు.

నాటుసారా స్వాధీనం.. ఒకరి అరెస్టు


పట్టుబడిన సారా నిందితుడితో ఎక్సైజ్ సిబ్బంది

రైల్వేకోడూరు రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం క్రాస్ వద్ద అక్రమంగా తరలిస్తున్న ఐదు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు ఎక్సైజ్ సీఐ టి.కె.తులసి తెలిపారు. రాబడిన సమాచారం మేరకు గురువారం తనిఖీలు నిర్వహిస్తుండగా వీపీఆర్ కండ్రిగ పంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన చెంచురామయ్య వద్ద నాటుసారా స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. అక్రమంగా నాటుసారా తయారు చేసిన, విక్రయించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాటుసారా ఎవరైనా తయారు చేస్తున్నా, తరలిస్తున్నా సమచారం ఇవ్వాలని కోరారు. ఈ దాడుల్లో సిబ్బంది చంద్రశేఖర్, శ్రీనివాసులు, మధుసూదన్ రాజు, సోమేశ్వర, రమణారెడ్డి, శివప్రసాద్ పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి

- ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నేతల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహులు

రాయచోటిటౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నేతలు డిమాండ్ చేశారు. గురువారం రాయచోటి పట్టణంలోని కొత్తపేటలో గల ఆ సంఘ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అపస్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, గౌరవాధ్యక్షులు పరశురాంలు మాట్లాడుతూ ఇటీవల బదిలీలు పొంది గత ఎనిమిది సంవత్సరాలుగా లాంగ్ స్టాండింగ్‌లో ఉండి వివిధ రకాలుగా బదిలీలు పొందిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి వారి కొత్త స్థానాల్లో చేరే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అపస్ జిల్లా సహాధ్యక్షుడు నాగేంద్రబాబు, రాష్ట్ర కార్యదర్శి మధుమతిలు మాట్లాడుతూ బదిలీలు పొందిన ఉపాధ్యాయులకు జీత బత్యాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో అపస్ నాయకులు సదాశివుడు, రెడ్డెయ్య, అపర్ణ, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు చోరీ చేసి రూ.25 వేలు డ్రా

నందలూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఏటీఎంలో మాయమాటలు చెప్పి ఏటీఎం కార్డు చోరీ చేసి రూ.25 వేలు విత్‌డ్రా చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. బాధితుడు విశ్రాంత ఉపాధ్యాయుడు సానిపాటి నరసింహులు వివరాల మేరకు.. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఏటీఎంలో డబ్బులు విత్‌డ్రా చేసుకునేందుకు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తి మాయమాటలు చెప్పి తన ఏటీఎం కార్డును చోరీ చేసి రూ.25 వేలను డ్రా చేసుకున్నారు. ఈ విషయంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.


నగదు పోగొట్టుకున్న బాధితుడు

సమస్యలకు తక్షణ పరిష్కారం : మంత్రి


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి

చిన్నమండెం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సమస్యలను తక్షణ పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. చిన్నమండెం మండలంలోని తన స్వగ్రామం బోరెడ్డిగారిపల్లెలో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి వందలాది మంది ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను మంత్రికి వినిపించారు. ప్రతిఒక్కరి సమస్యను శ్రద్ధగా విన్న మంత్రి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల ఆశయాలను సమర్థవంతంగా నెరవేర్చే దిశగా పనిచేస్తానన్నారు.

రైల్వేకోడూరు విద్యార్థి ప్రతిభ


పిడుగు కార్తీక్

రైల్వేకోడూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి జీప్యాట్ (గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్ట్) పరీక్షకు రైల్వేకోడూరు నరరాంపేటకు చెందిన విద్యార్థి పిడుగు కార్తీక్ అర్హత సాధించాడు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థి మాట్లాడుతూ కడపలో బి.ఫార్మసీ పూర్తి చేశానని, తన లక్ష్యాన్ని సాధించేందుకు నిరంతరాయంగా కృషి చేసి జాతీయ స్థాయిలో నిర్వహించే జీప్యాట్ పరీక్షకు అర్హత సాధించానని తెలిపారు. కాగా విద్యార్థి విజయం పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు సంతోషం వ్యక్తం చేశారు.

జాక్‌పాట్‌ను పూర్తిగా రద్దు చేస్తాం

- మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రమౌళి

గుర్రంకొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో జాక్‌పాట్ విధానాన్ని పూర్తి స్థాయిలో రద్దు చేయిస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ కోసూరి చంద్రమౌళి పేర్కొన్నారు. గుర్రంకొండ మార్కెట్ యార్డులో గురువారం ఆయన వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ టమోటా రైతులకు భారంగా ఉన్న జాక్‌పాట్ విధానాన్ని పూర్తిగా రద్దు చేస్తామన్నారు. వ్యాపారులు మార్కెట్ యార్డులో జాక్‌పాట్ నిర్వహించకుండా తగు సూచనలు చేసినట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా మార్కెట్ యార్డులో నెల రోజుల వ్యవధిలో 15 కిలోల క్రేట్‌లను ప్రవేశపెట్టి జాక్‌పాట్‌ను లేకుండా చూస్తామన్నారు. అలాగే వ్యాపారులు అధిక కమీషన్లు వసూలు చేయకుండా తగ్గిస్తామని తెలిపారు. మార్కెట్ కమిటీ తీసుకున్న నిర్ణయాలను వ్యాపారులు పాటించాలని, లేనియెడల వ్యాపారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మార్కెట్ యార్డులో చేయాల్సిన అభివృద్ధి పనులను పరిశీలించారు. రైతులకు అవసరమైన అన్ని వసతులను కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నౌషాద్‌అలీ, సభ్యులు బయ్యారెడ్డి, బాబాజాన్, నాయకులు నౌషాద్‌అహ్మద్, ఎల్లుట్ల మురళీ, సుదర్శన్, ఆనంద్, మహాత్మారెడ్డి, చంద్రబాబు, సుంకర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


గుర్రంకొండ మార్కెట్‌యార్డులో వ్యాపారులతో మాట్లాడుతున్న చైర్మన్ చంద్రమౌళి

ఈ ఏడాదైనా నష్టాలు తీరేనా...?

- ధరల పతనంతో నేరేడు రైతుకు కోలుకోలేని దెబ్బ
- కిలో రూ.30 నుంచి రూ.50

కురబలకోట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వరుస నష్టాలను చవిచూస్తున్న నేరేడు రైతులు, వ్యాపారులకు ఈ ఏడాది కూడా నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతి ఏడాది లాభాలను ఆర్జించవచ్చనే గంపెడాశతో వ్యాపారం చేసున్నారు. అయితే గత రెండేళ్లుగా విపరీతమైన పంట దిగుబడి రావడం, కరోనా తదితర కారణాలతో ధరలు తగ్గుముఖం పట్టడంతో పాటుగా ధరలు పతనమయ్యాయి. కాగా పంటపై చేసిన అప్పులు, వడ్డీలు ఎలా తీర్చాలో తెలియక లోలోపల కుమిలి పోతున్నారు. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన టమోటా పంటకు కనీసం గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతన్నలు వరుస నష్టాలను చవిచూస్తున్నారు. ప్రతి ఏడాది పడమటి ప్రాంత మండలాల్లో రైతన్నలు నేరేడు పంటను సాగు చేసి లాభాలను ఆర్జించవచ్చనే గంపెడాశతో ఎదురు చూస్తున్న రైతన్నలకు ఈ ఏడాది నిరాశే ఎదురైంది. నేరేడు ధరలు ప్రస్తుతం ధరలు పతనమవడంతో రైతన్నలకు కన్నీరు పెట్టిస్తుంది. దీంతో తీవ్ర నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితులు ఎదురవడంతో పంటపై చేసిన అప్పులు, వడ్డీలు ఎలా తీర్చాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు.

జిల్లాలోని పడమటి ప్రాంత మండలాల్లో రైతన్నలు వ్యవసాయంపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. ప్రధానంగా ఎక్కువ మంది రైతన్నలు టమోటా, మామిడి, అల్లనేరేడు తదితర పంటలను సాగు చేస్తారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అల్లనేరేడు పంట ధరలు ఒక్కసారిగా పతనమవడంతో రైతన్నలను కన్నీరు పెట్టిస్తుంది. కోరోనా దెబ్బ నుంచి కోలుకోలేని రైతన్నలకు ధరల పతనంతో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఏడాది దాదాపుగా అన్ని పంటల ధరలు నిరాశాజనకంగానే ఉన్నాయి. అయితే అల్లనేరేడును సాగు చేసి లాభాలను ఆర్జించవచ్చనే కొండంత ఆశతో సాగు చేసిన రైతన్నలకు ధరలు పాతాళానికి పడిపోవడంతో వారి ఆశలను అడియాసలు చేసింది. ఈ ఏడాది దారుణంగా అల్లనేరేడు ధరలు పతనమవడంలో ఏం చేయాలో దిక్కుతోచని అయోమయ స్థితిలో రైతన్నలు పడ్డారు. కాగా ప్రతి ఏడాది అల్లనేరేడు పంట మే మాసంలో ప్రారంభమై జులై మాసం వరకు పంట దిగుబడి చేతికి వస్తుంది. ఈ పంట సీజన్ దాదాపుగా మూడు నెలలుగా వస్తుంది. కాగా ఎరువులు, క్రిమి సంహారక మందులు, కూలీలు తదితర వాటికి సంబంధించి భారీగా ఖర్చు వస్తుంది. పంట చేతికి వచ్చిన తర్వాత మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉంచుతారు. ఇదివరలో పంట దిగుబడి తక్కువ రావడం, విపరీతమైన డిమాండ్ ఉండటంతో కిలో రూ.200 నుంచి రూ.400 వరకు పలికింది. కాగా ఇక్కడ అల్లనేరేడును కొనుగోలు చేసిన వ్యాపారులు హైదరాబాద్, విజయవాడ, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం మార్కెటింగ్ దిగుబడి అధికంగా రావడంతో డిమాండ్ అమ్మకాలు తగ్గుముఖం పట్టడంతో కొనేనాథుడు కరువయ్యారు. ప్రస్తుతం కిలో ధర రూ.30-40 మధ్య పలుకుతోంది. ఊహించని రీతిలో ఒక్కరిసారిగా ధరలు పతనం కావడం అంతుబట్టడం లేదు. కాగా ధరల పతనానికి ఇతర ప్రాంతాల్లో పంట దిగుబడి అధికంగా రావడంతో పాటు, ఎగుమతులు లేకపోవడం తదితర కారణాలతో ధరలు పతనమయ్యాయని వ్యాపారులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో రైతన్నలు నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. ప్రభుత్వం చర్యలు తీసుకుని అల్లనేరేడు రైతులకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.



రైతుల నుంచి నేరేడు కాయలను కొనుగోలు చేసే కేంద్రం వద్ద వ్యాపారులు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న అల్లనేరేడు

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం



ఉపాధి పథకం ద్వారా అక్కులగారిపల్లెలో సాగుచేసిన కొబ్బరిచెట్లు

- నిరుపేద రైతులకు అండగా గ్రామీణ ఉపాధిహామీ పథకం
- పండ్ల తోటల సాగుకు నెలాఖరు వరకు అవకాశం

లింగాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పండ్లతోటలు సాగుచేయాలంటే ఇపుడున్న పరిస్థితులలో సామాన్య రైతులకు శక్తికి మించిన పని. సంప్రదాయ పంటలు సాగు చేసుకుంటూ నష్టపోతున్న రైతులు ఎంతో మంది ఉన్నారు. ఉద్యాన పంటలు సాగుచేయాలంటే సహకరించని ఆర్థికపరిస్థితి. ఇటువంటి పరిస్థితులలో నలిగిపోతున్న నిరుపేద రైతుల కోసం చేయూతనందిస్తూ ప్రభుత్వం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీథకం ద్వారా 15 రకాల పండ్లతోటల సాగుకు అవకాశం కల్పిస్తోంది. మామిడి, చీనీ, పులుసు నిమ్మ, జామ, సపోట, నేరేడు, సీతాఫలం, రేగు, కొబ్బరిచెట్లు, దానిమ్మ, అంజీర, అవకడ, చింత, డ్రాగన్ ఫ్రూట్ వంటి పండ్ల తోటలసాగుకు అయ్యే ఖర్చులు మొత్తం భరించడంతో పాటు మూడేళ్ల సంరక్షణ నిధులు ప్రతి నెల రైతు ఖాతాలో జమ చేస్తారు. అలాగే పూల తోటల సాగులో భాగంగా మల్లెపూల మొక్కల రకాలు, రోజాపూల మొక్కల రకాలు, మునగ తోట సాగుకు అయ్యే ఖర్చులు భరిస్తూ రెండు సంవత్సరాలు సంరక్షణ నిధులు ప్రతినెల మంజూరు చేస్తారు. అలాగే పొలంగట్లపై టేకు, ఎర్రచదనం, నేరేడు, సీతాఫలం, కొబ్బరిచెట్లు, మలబారు, వేప, వెదురు మొక్కలు మంజూరు చేస్తూ వాటిని సంరక్షించేందుకు రెండు సంవత్సరాలు ప్రతినెల రైతులకు డబ్బులు చెల్లిస్తారు. నిరుపేద రైతులకు ఇది చక్కని అవకాశమని.. ఈనెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవచ్చని ఉపాధి హామీ పథకం ఏపీవో గంగరాజు తెలిపారు.



పెద్దకుడాలలో సాగుచేసిన చీనీచెట్లు

భారీ స్కోరు దిశగా కడప జట్టు

- 18 పరుగుల వెనకంజలో అనంతపురం



ప్రణీల్‌రెడ్డి (కడప), గురు విఘ్నేశ్ (కడప), వీరారెడ్డి (అనంతపురం)

కడప స్పోర్ట్స్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్ 19 మెన్స్ మల్టీడే (మూడురోజులు) క్రికెట్ మ్యాచ్‌లలో గురువారం కడప జట్టు కర్నూలు జట్టుపై 93 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 401 పరుగులతో పటిష్ఠ స్థితిలో ఉంది. మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టు నెల్లూరు జట్టు కన్నా 18 పరుగుల వెనుకంజలో ఉంది. వివరాలిలా... ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప-కర్నూలు జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కడప జట్టు బ్యాటింగ్‌కు దిగి మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 93 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 401 పరుగుల భారీ స్కోరు దిశగా సాగుతోంది. ఇందులో ప్రణీల్‌రెడ్డి 201 పరుగులు, గురు విఘ్నేశ్ 139 పరుగులు చేశారు. అలాగే కేఓఆర్ఎం మైదానంలో నెల్లూరు-అనంతపురం జట్ల మధ్య జరుగు తున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ చేపట్టి 50.4 ఓవర్లలో 212 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో మన్విత్‌రెడ్డి 48 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 34 ఓవర్లలో కేవలం ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 194 పరుగులు సాధించి పటిష్ఠ స్థితికి చేరుకుంది. ఇందులో వీరారెడ్డి 103 పరుగులు చేయడం విశేషం.

ఉరివేసుకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాశినాయన జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరికుంట్ల సమీపంలో జ్యోతి రోడ్డులోని అటవీ ప్రాంతంలో గుట్టపై గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందినట్లు ఎస్ఐ యోగేంద్ర తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... వరికుంట్ల గ్రామా నికి చెందిన ఉపాధి కూలీలు గురువారం పనికి వెళ్లారు ఉపాధి పని అనంతరం కొంతమంది పశుల మేతకోసం గుట్ట ఎక్కారు. అక్కడ దుర్వాసన రావడంతో పరిశీలించగా దాదాపు 40 సంవత్సరాల వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని చనిపోయాడు. విషయం స్థానిక వీఆర్ఏ, వీఆర్వోకు తెలిపారు. వారు తమ దృష్టికి తేవడంతో వెళ్లి పరిశీలించగా శవం కుళ్లిన స్థితిలో ఉంది. దాదాపు 20 రోజుల క్రితం ఉరివేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు కేసు నమోదు చేసి అక్కడే శవపరీక్ష చేసి పూడ్చించామన్నారు.

ప్రజాస్వామ్యాన్ని భ్రష్టుపట్టించిన చరిత్ర కాంగ్రెస్‌దే

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి

కడప మారుతీనగర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ భ్రష్టు పట్టించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి మండిపడ్డారు. గురువారం స్థానిక ఎన్జీవో కాలనీలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1975లో నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీకి సరిగ్గా 50 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. అప్పట్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా దేశ వ్యాప్తంగా ఎమర్జెన్సీ విధించి ప్రతిపక్ష నాయకులను జైలులో బంధించడం దారుణమన్నారు. ఇవాళ అదే కాంగ్రెస్ నేతగా సేవలందిస్తున్న రాహుల్‌గాంధీ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మారుస్తుందంటూ ప్రచారం చేయడం విడ్డూ రంగా ఉందన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అమలు పరుస్తున్న దేశ ప్రధాని నరేంద్రమోదీ గొప్ప రాజకీయ నీతి జ్ఞుడు అని కొనియాడారు. గత 11 సంవత్సరాలుగా దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మనదేశాన్ని ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశాల సరసన సగర్వంగా తలెత్తుకునేలా మనదేశాన్ని తీర్చిదిద్దుతున్నారన్న సంగతి గుర్తు పెట్టుకోవాలన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు డాక్టర్ శివనాయక్, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

2 నుంచి మహా గురుకులంలో తరగతులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప, కలెక్టరేట్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు అధునాతన వసతులు, నాణ్యమైన విద్యనందించే లక్ష్యంతో బి.మఠంలో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర మహా గురుకులంలో జూలై 2వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్‌లో బిమఠం మండలంలో నూతనంగా ఏర్పాటైన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మహా గురుకులం (బాలుర) విద్యాలయంలో తరగతుల ప్రారంభానికి సంసిద్ధత, ఏర్పాట్లు, విద్యార్థుల అడ్మిషన్ సంబంధిత అంశాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బి.మఠం సమీపంలో అత్యాధునిక మౌలిక సదుపాయాలు, వసతులతో సువిశాల ప్రాంగణంలో రూపు దిద్దుకున్న మహా గురుకులం వచ్చే నెల 2వ తేదీ నుంచి పేదలకు నాణ్యమైన విద్యను అందించనున్నామన్నారు. 960 మంది విద్యార్థులకు విద్యా వసతులు కల్పించగల సామర్థ్యం ఉన్న బాలుర మహా గురుకులంలో ఈ విద్యా సంవత్సరంలో 800 మంది విద్యార్థులతో అడ్మిషన్లను పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే సగిలేరు, బి.మఠం గురుకుల పాఠశాలల పాత భవనాల్లోని 660 మది విద్యార్థులను కూడా మహా గురుకులంలోకి షిఫ్ట్ చేయడం జరుగుతోందన్నారు. కొత్త అడ్మిషన్లకు సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియ కూడా కొనసాగుతోందన్నారు. తరగతులు ప్రారంభం నాటికి మహా గురుకులంలో ఎలాంటి మౌలిక సదుపాయాల కొరత లేకుండా చూడాలన్నారు. మహా గురుకులంలో అర్హులైన విద్యార్థులు చేరేందుకు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్, సాంఘీక సంక్షేమ గురుకులాల విద్యాలయాల జిల్లా కో-ఆర్డినేటర్ ఉదయశ్రీ, డీఈవో షంషుద్దీన్ , ఎస్ఎస్ఏ అధికారి నిత్యానందరాజులు, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, కాంట్రాక్ట్ ఏజెన్సీ పీఆర్ ఏపీఎస్పీడీసీఎల్ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఫుడ్ టెక్నాలజిస్టుల పాత్ర కీలకం

- ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ



మాట్లాడుతున్న వీసీ డాక్టర్ శారదా జయలక్ష్మిదేవి

పులివెందుల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో ఫుడ్ టెక్నాలజిస్టుల పాత్ర కీలకంగా ఉందని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సెలర్ డాక్టర్ ఆర్.శారదా జయ లక్ష్మీదేవి పేర్కొన్నారు. గురువారం పులివెందుల వద్దనున్న ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాల వద్ద కాలేజ్ అండ్ హాస్టల్‌డే సందర్భంగా వీసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లైవ్లీహుడ్ బిజినెస్ ఇంక్యుబేషన్‌సెంటర్, టూ-వీలర్ పార్కింగ్ షెడ్‌లను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ పులివెందుల వద్దనున్న కళాశాలలో చక్కని వనరులు ఉన్నాయన్నారు. ఈ వనరులను ఉపయోగించుకొని విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. టెక్నాలజీ విద్యార్థులకు ఉన్న ఉద్యోగ అవకాశాలను ఆమె వివరించారు. ఈ కళాశాలలో కోర్సు పూర్తవుతూనే వారు ఉద్యోగం కోసమే ఎదురుచూడాల్సిన అవసరం లేదన్నారు. సొంతంగా బిజినెస్ గాని, మార్కెటింగ్ గాని చేసుకునేలా కళాశాలలో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. నూతన ఆహార పదార్థాలను కళాశాలలో తయారు చేయించి వారిచే మార్కెటింగ్ ఎలా చేయాలి, ఎక్కడెక్కడ చేయాలనే అంశం కూడా ప్రాక్టికల్‌గా చేసి చూపుతున్నామన్నారు. అనంతరం వివిధ క్రీడలు, సాంస్కృతిక పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు ఉపకుల పతి చేతుల మీదుగా బహుమతులు, సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ టెక్నాలజీ డీన్ డాక్టర్ ఎ.మణి, భారత ప్రభుత్వ వ్యవ సాయ, ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్ ఎగుమతి అభివృద్ధి అథారిటీకి సంబం ధించిన తెలంగాణ ప్రాంతీయ విభాగాధిపతి ఆర్‌పీ నాయుడు, స్పైస్ బోర్డు అధికారి జి.శివకుమార్, పులివెందుల కళాశాల అసోసి యేట్ డీన్ డాక్టర్ ఎమ్.మాధవ, తదితర అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో మైదుకూరు మెప్మా



వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డును మెప్మా అధికారిణికి అందజేస్తున్న ఎమ్మెల్యే పుట్టా

మైదుకూరు రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలు చేసిన ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో అధిక సంఖ్యలో కొనుగోలు చేయడం వలన రాష్ట్రంలో పలు పట్టణాలతో పాటు, మైదుకూరు మెప్మాకు వరల్డ్ బుక్ఆఫ్ రికార్డ్సులో చోటు దక్కింది. ఈ మేరకు మైదుకూరుకు వచ్చిన షీల్డ్‌లను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చేతుల మీదుగా మెప్మా అధికారిణి కెజియా అందుకున్నారు. కార్యక్రమంలో అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో బీఎస్ఎఫ్ జవాన్ అంత్యక్రియలు





శివప్రకాష్‌రెడ్డి (ఫైల్), మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య బిడ్డలు

పులివెందుల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తొండూరు గ్రామానికి చెందిన బీఎస్ఎఫ్ జవాన్ డి.శివప్రకాష్‌రెడ్డి (42) అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. శివప్రకాష్‌రెడ్డి బీఎస్ఎఫ్ జవాన్‌గా పనిచేస్తున్నారు. సెలవుపై పది రోజుల క్రితం ఇంటికి వచ్చారు. బుధ వారం పులివెందులకు వెళుతుండగా గుండెపోటు రావడంతో మృతి చెందారు. ఈ విషయాన్ని బీఎస్ఎఫ్ అధికారులకు తెలపడంతో వారు వచ్చి మృతదేహంపై జాతీయ జెండా ఉంచి గౌరవ వందనం గావించారు. అనంతరం తొండూరులో గురువారం సాయంత్రం దహనసంస్కారాలు చేపట్టారు. కాగా, శివప్రకాష్‌రెడ్డికి భార్య నాగేశ్వరి, ఇద్దరు కుమార్తెలు అక్షిత, జ్యోత్స్న, కుమారుడు రుత్విక్‌రెడ్డిలు ఉన్నారు.


ఫర్నీచర్ షాపులో అగ్ని ప్రమాదం

- రూ.30లక్షలకు పైగా ఆస్తినష్టం



అగ్నిప్రమాదానికి ఆహుతి అయిన ఫర్నీచర్

బద్వేలుటౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని నెల్లూరు రోడ్ జాతీయ రహదారిలో గురువారం రాత్రి శ్రీలక్ష్మీసాయి ఫర్నీచర్ షాపులో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో రూ.30 లక్షల మేరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు యజమాని క్రిష్ణ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. నెల్లూరు జిల్లా అనంతసాగరం గ్రామానికి చెందిన చెప్పలి క్రిష్ణ ఒకటిన్నర సంవత్సరం కిందట బద్వేలు ప్రాంతానికి వచ్చి భగత్‌సింగ్ కాలనీలో నివాసం ఉంటూ నెల్లూరురోడ్డులో శ్రీలక్ష్మీ సాయి ఫర్నీచర్ షాపు పెట్టుకున్నాడు. ప్రతి రోజు మాదిరే గురు వారం రాత్రి 8.30 గంటలకు షాపును మూసివేసి ఇంటికి వెళ్లాడు. దుకాణం మూసివేసిన 30 నిమిషాల తరువాత దుకాణం నుంచి భారీగా పొగలు బయటకు రావడంతో దుకాణం పక్కనే ఉన్న వారు ఫైర్‌సిబ్బందికి సమాచారం అందజేశారు. వెంటనే అగ్నిమాపక అధికారి సుధాకర్, సీఐ రాజగోపాల్‌లు అక్కడకు చేరుకొని సిబ్బందితో షట్టర్‌ను ఓపెన్‌చేసి మంటలను అదుపుచేశారు. అనంతరం ఫైర్ సిబ్బంది షాపు యజమానికి సమాచారం ఇవ్వడంతో దుకాణదారుడు క్రిష్ణ అక్కడకు చేరుకున్నారు. అప్పుచేసి దుకాణం ప్రారంభించానని, ఈ అగ్నిప్రమాదంలో సుమారు రూ.30 లక్షల మేరకు ఫర్నీచర్ సామగ్రి అగ్నికి ఆహుతి అయిందంటూ లబోదిబోమంటున్నాడు. అగ్నిమాపక అధికారులను వివరణ కోరగా.. ఆస్తినష్టాన్ని అంచనా వేస్తున్నామని, రెండు రోజుల్లో పూర్తి వివరాలను తెలియ జేస్తామన్నారు.



నవోదయ/సైనిక్

2025-నవోదయ నందు 27 సీట్లు, సైనిక్ నందు- 17 సీట్లు సాధించిన శ్రీ దిన్నెపాటి బసిరెడ్డి వికాస్ కోచింగ్ అడ్మిషన్లు జరుగుచున్నవి. హాస్టలు వసతి కలదు. సెల్: 93909 21596
Ajc-233446

10th,ఇంటర్,డిగ్రీ పాసయ్యే ఛాన్స్

చదువు మధ్యలో ఆపేసిన (లేదా) ఫెయిల్ అయిన వారికి 10th, ఇంటర్, డిగ్రీ పాసయ్యే ఛాన్స్ కలదు. కడప సెల్: 90105 01122.
Ajc-233448

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA- 237854

WANTED

Gridplus Solar Energy Wanted - Sales Executives @ Tirupathi, Kadapa & Proddatur, Exp. @ 1-2 years, Edu. - Degree, Helpers - 10th Pass / Fail @ Proddatur, Cell : 96663 66205
AJC-245019

యూనిట్ కార్యాలయం
9985411183
9985411189

ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

వైసీపీ నేత అక్రమ నిర్మాణం కూల్చేందుకు యత్నం

- అడ్డుకున్న వైసీపీ శ్రేణులు
- బయనపల్లెలో ఉద్రిక్తం



శ్రీకాంత్‌రెడ్డి ఇంటి వద్ద గుమికూడిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు



అధికారులతో వాగ్వాదం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి

బద్వేలు రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బయనపల్లె చెరువులో వైసీపీ నేత నాగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి నిర్మించిన అక్రమ కట్టడాన్ని కూల్చివేసేందుకు అధికారులు యత్నించారు. బయనపల్లె గ్రామానికి చెందిన వైసీపీ వాలంటరీ విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి చెరువులో అక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. దాదాపు ఐదేళ్లుగా అదే ఇంటిలో నివాసం ఉంటున్నారు. ఇటీవల అధికారులు చెరువులు, ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాల కూల్చివేత కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్‌రెడ్డి, రూరల్ ఎస్ఐ శ్రీకాంత్, అట్లూరు ఎస్ఐ రామక్రిష్ణ, బి.కోడూరు ఎస్ఐ సురేశ్‌లతో పాటు తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు, పోలీసు, రెవెన్యూ సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకుని వైసీపీ నేత ఇంటి నిర్మాణం తొలగించేందుకు ప్రయత్నాలు చేపట్టారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 9 వరకు అక్రమ కట్టడాన్ని కూల్చివేసేందుకు ప్రయత్నించారు. ఎక్స్‌కవేటర్, ఫైరింజను కూడా తెచ్చి సిద్ధంగా ఉంచారు. ఈ విషయం తెలిసిన శ్రీకాంత్‌రెడ్డి అనుచరులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా ప్రతిఘటించారు. మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్ రెడ్డి, జడ్పీటీసీ వంకెల చిన్న పోలిరెడ్డి తదితర నాయకులతో సహా అందరూ బయనపల్లెకు చేరుకుని అధికారులతో మాట్లాడారు. తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడం ఏమిటని వారు ఇరిగేషన్ డీఈని ప్రశ్నించారు. కూల్చేందుకు వీలు లేదంటూ వైసీపీ నాయకులు కార్యకర్తలతో పాటు నాగిరెడ్డి కుటుంబ సభ్యులు, మహిళలు అడ్డుకున్నారు. దీంతో మీరు చెరువులో కట్టడం నిర్మిస్తున్నారన్న విషయం తెలియదా అని శ్రీకాంత్‌రెడ్డిని డీఈ ప్రశ్నించారు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగి... గ్రామం లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రాత్రి వరకూ పోలీసులు, రెవె న్యూ సిబ్బంది, ఇరిగేషన్ డీఈ అక్రమ కట్టడాన్ని పోలీసు సిబ్బంది సహకారంతో కూల్చివేసేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

గండిక్షేత్రంలో వేలం వాయిదా

చక్రాయపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో పూలు విక్రయం, టోల్‌గేట్ వసూలుకు నిర్వహించిన వేలం వాయిదా వేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం స్థానిక గండి క్షేత్రంలోని ఆలయ ఆవరణలో పూలు విక్రయం, టోల్ గేట్ వసూలుకు బహిరంగ వేలం నిర్వహించారు. పూల విక్రయానికి సంబం ధంచి ఆరుగురు, టోల్ గేట్ వసూలుకు ఐదుగురు మాత్రమే పాల్గొన్నారన్నారు. బహిరంగ వేలంలో పాటదా రులు ఎవరూ పాటపాడేందుకు ముందుకు రానందున నిలిపివేశామన్నారు.

అలాగే దేవస్థాన షాపింగ్ కాంప్లెక్స్‌లోని 44 షాపులకు సంబంధించి హిందువులకు మాత్రమే పాల్గొనే అవకాశం కల్పించాలని బీజేపీ, విశ్వహిందూ పరిషత్ వారు లేఖల ద్వారా తెలియజేసినందున బహిరంగ వేలం తాత్కాలికంగా నిలుపుదల చేశామన్నారు. ఈ బహిరంగ వేలంలో జిల్లా దేవదాయశాఖ అధికారి మల్లికార్జునప్రసాద్, దేవస్థాన చైర్మన్ కృష్ణతేజ, మాజీచైర్మన్ వెంకటస్వామి, దేవస్థానం ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్, ఆలయ, బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ICICI Bank సమోదిత కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్, చక్లి సర్కిల్ సమీపాన, పాత పద్రా రోడ్, వడోదర - 390 007
కార్పొరేట్ కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ముంబాయి 400 051.

బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన

ICICI బ్యాంక్ లిమిటెడ్ ("ICICI బ్యాంక్") నుండి వారిచే వినియోగించబడిన బంగారు ఆభరణాలపై రుణమతి ("మతి")గా పొందిన వారి బకాయి మొత్తములను చెల్లించవలసినదిగా దిగువ పేర్కొనబడిన రుణగ్రహీతలకు నోటీసులు జారీ చేయబడినవి. తమ బకాయిలను తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, తప్పనిసరి పరిస్థితిలో జూలై 7, 2025న తనఖా చేయబడిన బంగారు ఆభరణములకు మేము ఇ-వేలము నిర్వహించుచున్నాము. ముందస్తు సమాచారం లేకుండా ఖాతాను తొలగించు / వేలము తేదీని మార్చు హక్కును ICICI బ్యాంక్ కలిగియున్నది. ఇ-వేలము ఆన్‌లైన్ ద్వారా మ.12.30 గం. నుండి మ.3.30 గం.ల మధ్య https://gold.samil.inలో నిర్వహించబడును. సవివర నియమ నిబంధనల కొరకు దిగువ ఇచ్చిన వెబ్‌సైట్‌కు లాగిన్ అవ్వండి. ఒకవేళ రుణగ్రహీత మరణించినచో న్యాయవారసులకు అన్ని నిబంధనలు వర్తిస్తాయి.

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: అద్దంకి	
758462001937	కేశనపల్లి అభినవ్
758462001958	కేశనపల్లి అభినవ్
758462002318	కేశనపల్లి అభినవ్
758462002407	కేశనపల్లి అభినవ్
758462002181	దర్శి శామ్యూల్
శాఖ పేరు: అమలాపురం	
044162010261	గూడపల్లి నాగేంద్ర
శాఖ పేరు: కడప	
067462014451	ప్రదీప్ వి
067462014433	ఆర్‌వి శేషాంజనేయ కుమార్
శాఖ పేరు: దర్శి	
782962000447	వీరంరెడ్డి మల్లిఖార్జునరెడ్డి
శాఖ పేరు: ధర్మవరం	
103462015817	పి. జయరాం
103462015642	పి. జయరాం
శాఖ పేరు: డోన్	
794962000373	రాగిమాను కమలాకర్
శాఖ పేరు: గుంటూరు	
630762031704	కన్నా బాల రవితేజ
630757016619	త్రివేణి ఎస్.
శాఖ పేరు: గుంటూరు - పొన్నూరు రోడ్	
532357000004	మహ్మద్ జమీల్
శాఖ పేరు: హిందూపూర్	
067262006662	జి. అశోక్ కుమార్
067262006427	మహ్మద్ ఇమ్రాన్
శాఖ పేరు: జాల్లకల్లు	
307462001017	జరపల్లి వెంకటరెడ్డి
శాఖ పేరు: కదిరి	

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
395462003849	వడ్డిరెడ్డి వెంకట రమణారెడ్డి
395462003973	వడ్డిరెడ్డి వెంకట రమణారెడ్డి
శాఖ పేరు: కాకినాడ	
028062008777	బత్తుల రాజ్ ప్రదీప్
శాఖ పేరు: కల్లూరి	
306962000540	నిచ్చెనకల్ల విఘ్నేష్
శాఖ పేరు: కనిగిరి	
069862018298	ప్రదీప్ షేక్
069862018504	ప్రదీప్ షేక్
శాఖ పేరు: కావూరు	
530062000096	ముమ్మడిశెట్టి కుటుంబ శాస్త్రులు
530062000132	ముగడ ఉమా మహేష్
శాఖ పేరు: కర్నూలు	
027962019414	పల్లె మురళీధర్
027962019891	కనుగుల కిరణ్ కుమార్
శాఖ పేరు: నెల్లూరు	
631062023153	బోర ప్రసాద్
631062023415	బోర ప్రసాద్
శాఖ పేరు: నూజివీడు	
198262006478	వెలివెల నాగరాజా
198262006481	వెలివెల నాగరాజా
శాఖ పేరు: పుత్తూరు-ఆంధ్రప్రదేశ్	
200462006675	టి. వినోద్ కుమార్
శాఖ పేరు: రాజమండ్రి	
631557003633	పారిపెల్ల సుందర ఆదిత్య
శాఖ పేరు: సత్తెనపల్లి	
285362000777	చింతపల్లి జక్రం
శాఖ పేరు: తుని	
197962012695	మల్లిడి నరేంద్ర రెడ్డి
శాఖ పేరు: విశాఖపట్నం - మధురవాడ	
240562001601	నాగల లావణ్య

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: విశాఖపట్నం - కూర్మనపాలెం	
437957000021	పత్సవాయి వెంకట రామరాజు
శాఖ పేరు: విన్నకోట	
460062000020	పెంకి ఫుల్లారావు
శాఖ పేరు: బెరహంపూర్ - మెడికల్ కాలేజ్ రోడ్	
149757000103	తున్న చరణ్ మండల్
శాఖ పేరు: హైదరాబాద్ - ఇమేజ్ గార్డెన్స్	
720362000624	అట్లూరు కుమారి
శాఖ పేరు: హైదరాబాద్ - రామంతాపూర్	
412262000687	నూరెళ్ళ సయ్యద్
శాఖ పేరు: హైదరాబాద్ - కూకట్‌పల్లి	
631262037231	గోగిరెడ్డి శివశంకర రెడ్డి
శాఖ పేరు: కొత్తవలస	
222262001574	బొడ్డి బాలరాజు
శాఖ పేరు: కూకట్‌పల్లి - నిజాంపేట్	
180562004083	ఎ. వెంకట రమణ శాస్త్రి
శాఖ పేరు: పర్లాకిమిడి	
063862008071	మీసాల జ్ఞానేశ్వరరావు
శాఖ పేరు: పూణె - జొండ్ నగర్‌దాస్ రోడ్	
187862002140	వేలూరి జనార్ధన్ రెడ్డి
187862002349	వేలూరి జనార్ధన్ రెడ్డి
శాఖ పేరు: షాద్‌నగర్	
379962005776	రవి కుమార్
శాఖ పేరు: షోలింగూర్	
761662002588	సుధాకర్ వి
761662002589	సుధాకర్ వి
761662002590	సుధాకర్ వి
శాఖ పేరు: తిరునల్వేలి జంక్షన్	
613562028207	ఉమ్మిడి అప్పల రాజు

తేది : 27.06.2025
ప్రదేశం: బాపట్ల, గుంటూరు, కాకినాడ, డా. బి.ఆర్ అంబేద్కర్‌కోనసీమ, తూర్పు గోదావరి, ఏలూరు, కృష్ణ, కర్నూలు, నంద్యాల, ఎన్‌టిఆర్, పల్నాడు, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, శ్రీ సత్య సాయి, తిరుపతి, విశాఖపట్నం, వై.ఎస్.ఆర్, ఇచ్ఛాపురం, కడప, నెల్లూరు, మహబూబ్‌నగర్, హైదరాబాద్, శ్రీకాకుళం, ప్రకాశం, రంగారెడ్డి, చిత్తూరు, విశాఖపట్నం

సం/- అధీకృత అధికారి, ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున

యువత మత్తుకు బానిస కావొద్దు

● మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవంలో ఆర్డీవో చిన్నయ్య ● పోలీసుల ర్యాలీ



పులివెందులలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ర్యాలీ

పులివెందుల, జూన్ 26(ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా వారి భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలని పులివెందుల ఆర్డీవో చిన్నయ్య అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా పులివెందులలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పూలంగళ్ల కూడలిలో మత్తుపదార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మాదక ద్రవ్యాలు ఎంతో ప్రమాదకరమైనవన్నారు. మాదకద్రవ్యాల బారిన పడి ఎవరూ తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని, వీటి బారిన పడకుండా ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అనంతరం డీఎస్పీ మురళీనాయక్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అందరూ దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలు సేవించడం వల్ల విచక్షణ కోల్పోయి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. మాదక ద్రవ్యాలు ఎక్కడైనా అమ్ముతున్నా, సేవిస్తున్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. మాదక ద్రవ్యాలతో దేశాన్ని భ్రష్టు పట్టించాలని కొన్ని అసాంఘిక శక్తులు ప్రయత్నిస్తున్నాయన్నారు. యువత వీటి బారిన పడకుండా జాగ్రత్త పడాలన్నారు. ఒకసారి మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే వారిని మార్చడం కష్టమవుతుందన్నారు. వాటిజోలికి వెళ్లకుండా ఎవరికి వారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నజీర్ అహ్మద్, సీఐలు చాంద్‌బాష, రమణ, నరసింహులు, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మాదకద్రవ్యాలను నిర్మూలించి యువతను కాపాడుదాం'

కమలాపురం రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలను నిర్మూలించి, దేశ యువతను కాపాడుదామని ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. గురువారం కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని పోలీసుశాఖ, మదర్‌థెరిసా సేవా సమితి చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ దేశంలో రోజురోజుకూ యువత చెడుత్రోవ పడుతున్నారని, మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్నారన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి వారి జీవితాలను అంధకారంలోకి వారే తీసుకెళుతున్నారన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉమేశ్‌చంద్ర, నీలం శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎస్ఐ విద్యాసాగర్

ఫటాఫట్

కడప-బెంగళూరు రూట్లో ఎక్కువ ఆదాయం

● డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు



కడప మారుతీనగర్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మిగతా అన్ని డిపోల కంటే కడప-బెంగుళూరుకు తిరిగే రూట్ ద్వారా ఎక్కువ ఆదాయం వస్తోందని, ఒకరకంగా చెప్పాలంటే కడప డిపో ఆదాయానికి బెంగుళూరు రూట్ గుండెకాయ లాంటిదని డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు తెలిపారు. గురువారం ఆయనను 'ఆంధ్రజ్యోతి' ఫటాఫట్ ఇంటర్వ్యూ చేసింది. ఆ వివరాలు..

ప్రశ్న: కడప-బెంగుళూరు రూట్‌లో రోజుకు ఎన్ని బస్సులు తిరుగుతాయి.. ఎంత ఆదాయం వస్తుంది?
జవాబు: కడప-బెంగళూరుకు 20 బస్సులు తిరుగుతాయి. రోజుకు రూ.5.36 లక్షలు వస్తుంది. ఆ లెక్కన నెలకు రూ.1.60 కోట్లు.

ప్రశ్న: బెంగుళూరు రూట్ కాకుండా ఆదాయం వచ్చే మరో రూట్ ఏది?
జవాబు: ప్రొద్దుటూరు రూట్

ప్రశ్న: టోటల్‌గా కడప డిపోలోని బస్సులు.. అద్దె బస్సులెన్ని ?
జవాబు: 86 ఆర్టీసీ బస్సులు.. మరో 48 అద్దె బస్సులు ఉన్నాయి.

ప్రశ్న: కడప డిపోలో కండక్టర్ల.. డ్రైవర్ల షార్టేజ్ వుందా....
జవాబు: ఉంది. రిటైర్మెంట్ అవుతున్నవారి ప్లేస్‌లో కొత్త రిక్రూట్‌మెంట్ లేదు. 2014 నుండి ఆర్టీసీలో ఉద్యోగాల నియామకాలు లేవు. దీంతో కొంతమంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో నెట్టుకొస్తున్నాం.

ప్రశ్న: ఆర్టీసీ గ్యారేజ్ పరిస్థితి ?
జవాబు: గ్యారేజ్‌లో కూడా సిబ్బంది కొరత వుంది. ప్రస్తుతం 76 మంది రెగ్యులర్ ఉద్యోగులు సేవందిస్తున్నారు. వారిలో శ్రామిక్స్, మెకానిక్స్, సూపర్‌వైజర్స్, కోచ్ బిల్డర్స్ ఉన్నారు.

ప్రశ్న: కొత్తగా రూపుదిద్దుకుంటున్న గ్యారేజ్ ఎప్పటికి సిద్ధమవుతుంది?
జవాబు: మరో మూడు నెలలు పడుతుంది. సెప్టెంబర్ నాటికి రెడీ.

ప్రశ్న: ఏ పనులు పెండింగ్‌లో వున్నాయి?
జవాబు: ప్రస్తుతానికి గ్యారేజీ ఆఫీస్ పనులైతే సిద్ధమయ్యాయి. కాకపోతే ఫ్లోరింగ్, క్యూరింగ్ తదితర పనులు మిగిలున్నాయి.

ప్రశ్న: ప్రస్తుతం గ్యారేజీలో పాముల బెడద వుందా?
జవాబు: గ్యారేజీ పరిసరాలు శుభ్రంగా వుంచుకోకపోవడం వల్లే క్రిమికీటకాలు ఇతర ఆహారం కోసం వస్తున్నాయి. ఎక్కడ పడితే అక్కడ తిన్న ఆహారం వేయడం వలన ఎలుకలు, పాములు వస్తున్నాయి.

విద్యుత్ షాక్ బాధిత కుటుంబానికి ప్రభుత్వ సాయం

కడప నాగరాజుపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా నిలబడి ఆర్థికంగా తోడ్పాటును అందించింది. మే 9వ తేదీన నీలం ఓబులేసు అనే వ్యక్తి ఫాతిమా మెడికల్ కళాశాలలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. అయితే కళాశాల యాజమాన్యం స్పందించకపోవడంతో ఎమ్మెల్యే ఆర్.మాధవి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు బాధిత కుటుంబాన్ని ఆదుకుంటూ మంజూరైన రూ.4లక్షల చెక్కును ఎమ్మెల్యే, పొలిట్‌బ్యూరో సభ్యుడు మృతుడి భార్య లతకు అందజేశారు. కార్యక్రమంలో 48వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి శివారెడ్డి, రామరాజుపల్లె టీడీపీ నాయకులు శివశంకర్‌రెడ్డి, సుబ్బరాయుడు, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు మునెయ్య, చంద్రగుప్త, వెంకటరమణ పాల్గొన్నారు.

రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నిక ఏకగ్రీవం

కడప ఎర్రముక్కపల్లె,జూన్ 26(ఆంధ్రజ్యోతి): రైల్వే ఇన్‌స్టిట్యూట్ భవన్ ఎన్నిక ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది. నామినేషన్‌కు గురువారం ఆఖరురోజు కావడంతో కేవలం మద్దూరు యూనియన్ వర్గం మాత్రమే నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో ఎన్నిక ఏకగ్రీవం కానుంది. అయితే సంబంధిత అధికారి నిర్ధారించాల్సి ఉంది. మజ్దూర్ యూనియన్ తరఫున రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీగా రవికుమార్, సంయుక్త కార్యదర్శిగా నరేష్‌కుమార్, కోశాధికారిగా వెంకటేశ్వరరెడ్డి, ఆపరేటింగ్ కమిటీ సభ్యులుగా లక్ష్మీనారాయణ, చిన్నబాబు, ఎలక్ట్రికల్, కమర్షియల్, ఇంజనీరింగ్, ఎస్ అండ్ కమిటీ సభ్యులుగా రాజేష్‌కుమార్, గీత, అనిల్‌కుమార్, మస్తాన్ నామినేషన్ వేశారు. ఎన్నిక ఏకగ్రీవమైనట్లు అధికారులు ధ్రువీకరించినట్లయితే వీళ్ల రైల్వే ఇన్‌స్టిట్యూట్ భవనం నూతన కార్యవర్గంగా కొనసాగనున్నారు.

కందులు, మినుముల మినీ కిట్లు పంపిణీ

వేముల, జూన్ 26: మండలంలోని రైతులకు కందులు, మినుములకు సంబంధించిన మినీకిట్లను పంపిణీ చేశారు. స్థానిక కార్యాలయంలో గురువారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి, మండల వ్యవసాయాధికారి ఓబులేసు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కందులు, మినుములు కావాల్సిన రైతులు సంబంధిత రైతు సేవా సిబ్బందిని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని ఏవో తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వృద్ధులకు నేరుగా ఇంటికే సరుకులు

లింగాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే నేరుగా నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తామని తహసీల్దార్ ఈశ్వరయ్య అన్నారు. గురువారం ఆయన నిత్యావసర సరుకుల పంపిణీని ప్రారంభించారు. మండలంలో 1323 కార్డుదారులు ఉన్నారని, వీరిలో 55 మంది చనిపోయారని, మిగిలిన లబ్ధిదారులకు ఈనెల 30లోగా పంపిణీ పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీటీ నరేంద్ర, ఆర్ఐ గంగాధర్‌యాదవ్ పాల్గొన్నారు.

దళితుల భూములు మరొకరికి ఎలా చెందుతాయి?

● మహాజన రాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు సంగటి మనోహర్



చేతులకు తాళ్లు కొట్టుకొని నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

కడప సెవెన్ రోడ్స్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పాత కడప దళితులకు 2005లో ప్రభుత్వం భూమి కేటాయించిందని, అదే భూమిని మరొకరికి ఎలా కేటాయిస్తారని మహాజన రాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు సంగటి మనోహర్ అన్నారు. దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద దళితులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలకు మద్దతుగా చేతులను తాళ్లతో కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విశ్రాంత జిల్లా పరిశ్రమల శాఖ అధికారి గోపాల్, విశ్రాంత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గుర్రప్ప, హైకోర్టు న్యాయవాది అమీన్‌పీర్ ప్రభుత్వ అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వానికి ఆ భూమితో ఏదైనా అవసరం ఉంటే దళితులకు వేరొక ప్రాంతంలో భూమిని కేటాయిస్తుందే తప్ప దళితుల భూమి ఇతరులకు చెందే ప్రసక్తే లేదన్నారు. దళితుల భూమిని యథేచ్ఛగా దొంగలిస్తున్నారని, ఇందుకు రెవెన్యూ అధికారులు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని ఆరోపించారు. సంబంధిత రెవెన్యూ అధికారులు పాతకడప దళితుల భూ సమస్యపై పరిష్కార మార్గాలను చూపాలని, దళితుల భూమిని ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు వెంకటేశ్, మడగలం ప్రసాద్, మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు చేపల సుబ్బరాయుడు, నూర్‌బాష సుభాషిన్ రావు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమానికి మహిళా సర్పంచుల డుమ్మా

● సచివాలయ సిబ్బందితో మేనేజ్



పులివెందుల రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను, ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని గ్రామీణప్రాంతాల అభివృద్ధికి తోడ్పడాల్సిన పంచాయతీ సర్పంచులు శిక్షణ తరగతులకు డుమ్మా కొట్టారు. తమ పరిధిలో ఏఏ సమస్యలు ఉన్నాయి, వాటిని ఎలా పరిష్కరించాలి, ఆదాయ వనరులు ఎలా పెంపొందించుకోవాలి, పన్ను వసూళ్లు రాబట్టి ఆయా ప్రాంతాలలో అభివృద్ధి పనులు ఎలా చేయవచ్చో ఇచ్చే శిక్షణ కార్యక్రమానికి సర్పంచులు ఎగనామం పెట్టారు. గురువారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో మహిళా సర్పంచులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటిరోజు శిక్షణకు కేవలం ఏడుగురు మాత్రమే హాజరయ్యారు. పులివెందుల మండలంలో ముగ్గురు, లింగాల మండలంలో 11 మంది, సింహాద్రి పురం మండలంలో 12 మంది, తొండూరు మండలంలో 9 మంది.. మొత్తం 35మంది మహిళా సర్పంచులు ఉన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైనవారే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలా అంటూ అధికారులు చర్చించుకుంటున్నారు. కాగా సర్పంచులు రాకపోవడంతో కాసేపు సచివాలయ సిబ్బందిని, పంచాయతీ కార్యదర్శులను కూర్చొబెట్టి ఫోటోలు తీసుకోవడం విశేషం.

రోడ్లలో చెత్త వేస్తే కేసులు నమోదు చేస్తాం : ఎంపీడీవో



ప్రజలకు వివరిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీవో, సెక్రటరీ

పెండ్లిమర్రి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు రోడ్లలో చెత్త, మురికి నీటిని వేస్తే కేసులు నమోదు చేస్తామని ఇన్‌చార్జ్ ఎంపీడీవో సురేంద్రనాథ్ తెలిపారు. నంది మండలం గ్రామంలో గురువారం ఇంటింటికి చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజులకు ఒకసారి ట్రాక్టర్ ప్రతి వీధికి వస్తుందని, కానీ ఎన్నిసార్లు చెప్పినా ప్రజలు చెత్తను రోడ్లపైనే వేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఇది లాస్ట్ వార్నింగ్ అని, మరలా ఇలా చేస్తే జరిమానా వేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ'కు ఆంక్షలు, కోతలు వద్దు

● తులసిరెడ్డి

వేంపల్లె, జూన్ 26(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి ఆంక్షలు పెట్టవద్దని, కోతలు విధించవద్దని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ కూటమి రైతుకు ఏటా రూ.20వేల ఆర్థికసాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తొలి ఏడాది 2024-25లో ఒక్కపైసా కూడా ఆర్థికసాయం చేయలేదని, 2025-26కు సంబంధించి ఇప్పటి వరకు అమలు కాలేదన్నారు. అయితే రైతుల ఎంపికలో అనేక ఆంక్షలు విధించినట్లు తెలుస్తోందని, డీకేటి, చుక్కల భూముల రైతులు, కౌలు రైతులను ఈ పథకం నుంచి తొలగించినట్లు తెలుస్తోందన్నారు. కావున పథకాన్ని అందరికీ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పూల నజీర్, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్నతదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఏఆర్ కానిస్టేబుల్ మృతి

కడపక్రైం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని మృత్యుంజయకుంటలో నివాసం ఉంటున్న ఏఆర్ కానిస్టేబుల్ ఖాజావలీ (50) ప్రమాదవశాత్తు కిందపడి ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందినట్లు చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లాలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఖాజీవలీ గురువారం కడపలోని తన నివాసానికి వచ్చారు. అలాగే ఆర్‌కే నగర్‌లో ఉన్న మరో ఇంటికి పైకప్పు బాగు చేయించేందుకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి ప్రమాదవశాత్తు కిందపడటంతో తలకు తీవ్ర గాయమైనట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం ఆయనను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేమ్‌బోర్డులో ఊడిన అక్షరం



వైవీయూ మెయిన్‌గేట్ ఆర్చిపై ఊడిన అక్షరం

● పట్టించుకోని అధికారులు
● న్యాక్ పనులపై విచారణ జరిపించాలి
● ఆర్వీఎస్ రాష్ట్ర కార్యదర్శి మల్లేల జగదీష్ డిమాండు

కడప మారుతీనగర్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం ప్రధాన గేటు ఆర్చి పైన పెట్టిన ఆ విశ్వవిద్యాలయం తాలూకు నేమ్‌బోర్డులో అక్షరం పెచ్చులూడిపోయి కింద పడిందని రాయలసీమ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి మల్లేల జగదీష్ ఆవేదన వ్యక్తం చేశారు. అయినా యూనివర్సిటీ అధికారులు స్పందించకపోవడం విచారకరమన్నారు. గురువారం ఆర్వీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆయన విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాక్ గ్రేడింగ్ కోసం యూనివర్శిటీ అధికారులు అప్పటి వీసీ ఆధ్వర్యంలో సుందరీకరణ పనులు చేపట్టారని, దీని కోసం రూ.2కోట్లకు పైగా ఖర్చు చేశారన్నారు. కాగా నాక్ బృందం యూనివర్శిటీని సందర్శించి పట్టుమని రెండేళ్లు కూడా పూర్తి కాకముందే ప్రధాన గేటుపై ఉన్న విశ్వవిద్యాలయం పేరులోని అక్షరాలు ఊడడం బాధాకరమన్నారు. పైపెచ్చు లోపల ఉన్న వేమన విగ్రహాన్ని బయట పెట్టి అవమానపరిచారన్నారు. న్యాక్ సమయంలో జరిగిన పనుల్లో తీవ్ర అవినీతి జరిగిందని, తక్షణమే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించి సిట్‌తో విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

'మోదీ, అమిత్‌షా నాటకాలు ఆడుతున్నారు'

కడపకలెక్టరేట్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): దేశంలో కాంగ్రెస్ చేపట్టిన సంవిధాన్ బచావో యాత్రతో బీజేపీ ఉలిక్కి పడిందని, అందుకే ఎమర్జెన్సీ డే పేరుతో మోదీ, అమిత్‌షాలు నాటకాలు ఆడుతున్నారని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. భారత ప్రజాస్వామ్యం ఒక క్రమబద్ధమైనదన్నారు. బీజేపీ 11 ఏళ్ల పాలనలో ఐదురెట్లు దాడికి గురైందని ఆరోపించారు. రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ పెద్దలు బహిరంగంగా చెబుతుండడం విచారకరమన్నారు. మోదీ పాలనలో దేశంలో కుల, మతాల మధ్య చిచ్చులతో అప్రకటిత ఎమర్జెన్సీని తలపించిందని, ఇకపోతే ప్రశ్నించే నాయకులు, ప్రతిపక్షాలను, బీజేపీ వ్యతిరేకులను ఈడీ, సీబీఐ, ఆదాయశాఖలతో జైలుకుపంపుతున్నారని మండిపడ్డారు. మీడియాను మూగబోయేటట్లు చేశారని, ఆర్టీఐ చట్టాన్ని నీరసింపచేసి దేశంలో విలువలకు పాతర వేశారని ఆ ప్రకటనలో విజయజ్యోతి పేర్కొన్నారు.

'8 వసంతాలు' సినిమాను బ్యాన్ చేయాలి



మాట్లాడుతున్న ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ సిద్ధాంతి

వేంపల్లె, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): 8 వసంతాలు సినిమాను రాష్ట్ర ప్రభుత్వం బ్యాన్ చేయాలని అఖిల భారతీయ బ్రాహ్మణ మహా సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ సిద్ధాంతి డిమాండ్ చేశారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిత్రంలో పవిత్ర కాశీ క్షేత్రంలో ఫైట్ సీన్స్ పెట్టడంతో పాటు బ్రాహ్మణుడు, ముస్లిం కలిసి ఒక మహిళను రేప్ చేసే సీన్ పెట్టడం సరైంది కాదన్నారు. పుణ్యక్షేత్రాలను దెబ్బతీసే విధంగా సినిమాలు తీస్తే అడ్డుకుంటామని, 8వసంతాలు సినిమా ఓటీటీలో రాకుండా చూడాలని కోరారు. మైత్రి మూవీస్ నిర్మాతలు, దర్శకుడిపై కేసు నమోదు చేయాలని డిమాండు చేశారు.

ఫోను చేసి చెత్త సేకరణ

చెన్నూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సేకరించే చెత్త విషయమై ఇంటింటికీ ఫోను చేసి చెత్త సేకరించనున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో సురేశ్‌బాబు తెలిపారు. గురువారం మండలంలోని బయనపల్లె గ్రామ పంచాయతీలో ఉదయం నుండి ఇంటింటికీ చెత్త సేకరణ జరుగుతుందా లేదా అని విచారించారు. అలాగే ఇంటి యజమానులతో మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త సేకరించే వారికి ఇవ్వాలన్నారు. చెత్త సేకరణ సక్రమంగా జరగకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఉదయమే పంచాయతీసిబ్బంది రాకపోతే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రోజూ చెత్త సేకరణ జరిగితే గ్రామం పరిశుభ్రంగా, ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం ఇళ్ల వద్దకు తిరిగి చెత్తసేకరణపై అవగాహన కల్పించారు.

ఇరువురిపై కత్తులతో దాడి : కేసు నమోదు

కడపక్రైం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని గంజికుంట కాలనీలో ఇరువురుపై గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేసినట్లు చిన్నచౌకు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. గంజికుంట కాలనీలోని వెంకటసుబ్బయ్య, బబ్లూ వారి ఇంటి వద్ద మాట్లాడుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి గొడవ పెట్టుకున్నారు. మాటామాట పెరగడంతో గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో వెంకటసుబ్బయ్య, బబ్లూపై దాడి చేసి పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. చికిత్స నిమిత్తం వారిని రిమ్స్‌కు తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రవికుమార్ నియామకం హర్షణీయం

కడప మారుతీనగర్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెన్స్ తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్‌టీఎస్) చైర్మన్‌గా, అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారుడిగా వేమూరి రవికుమార్‌ను నియమించడం హర్షణీయమని ఎన్ఆర్ఐ తెలుగుదేశం పార్టీ కువైట్ ఉపాధ్యక్షుడు షేక్ రహ్మతుల్లా అన్నారు. గురువారం స్థానిక దేవునికడప రోడ్డులో ఉన్న ఎన్ఆర్ఐ టీడీపీ కార్యాలయంలో వేమూరి రవికుమార్‌ను ఆయన ఘనంగా సత్కరించారు. 2014-19 మధ్య ఏపీఎన్ఆర్‌టీఎస్ చైర్మన్‌గా వేమూరి రవికుమార్ విశేష సేవలందించారని గుర్తు చేశారు. దీంతో మరోసారి ఆయనకు ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు.



రవికుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న రహ్మతుల్లా

టెండరు ప్రకటన

శ్రీ లక్ష్మి చెన్నకేశవ దేవస్థానం కొర్రపాడు గ్రామం, ముద్దనూరు మండలం, కడపజిల్లా ఈ దిగువ కనపరచిన పనినిచేయుటకు సీలు వేసిన టెండర్లు రిజిస్టర్ కాంట్రాక్టర్ నుండి దేవాదాయ శాఖ లేక ఏ ఇతర డిపార్టుమెంటులోనైన రిజిష్టరు కాబడిన వారు 4.07.2025 తేది సాయంత్రం 4 గంటలలోపల దేవస్థాన కార్యాలయములో ఉంచిన టెండరు బాక్సులో వేయవలెను. అదే రోజు సాయంత్రం 4.30 గంటలకు కార్యనిర్వహణాధికారి గారి ట్రస్టు బోర్డు చైర్మన్ హాజరైన టెండరు దారుల సమక్షంలో సీలు వేసిన టెండర్లు తెరువబడును. టెండరు షెడ్యూలు కొరకు దరఖాస్తు 27-06-2025 సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు రిజిస్ట్రేషన్ & సర్టిఫికెట్, పాన్‌కార్డు, సేల్స్‌ట్యాక్స్, ఇ.ఎం.డి. టెండరు సెట్ వెల జతపరచి ఇవ్వవలెను. టెండర్ షెడ్యూలు 30-6-2025 నుండి 3-07-2025 సాయంత్రం 5 గంటల వరకు పొందవచ్చును. ఇ.ఎం.డి. మరియు టెండరు సెట్ వెల కార్యనిర్వహణాధికారి, శ్రీ లక్ష్మిచెన్నకేశవ దేవస్థానం కొర్రపాడు గ్రామం, ముద్దనూరు మండలం, కడపజిల్లా పేరుమీద డి.డి.లు తీయవలెను. ఏ కారణము తెలుపకయే ఏ ఒక్క టెండరు అయినను లేదా అన్ని టెండర్స్‌ను నిరాకరించుటకు దేవస్థానం అధికారులకు అధికారము కలదు. ఎట్టి పరిస్థితులలోను టెండరు సెట్ వెల వాపసు ఇవ్వబడదు.

వరుస సంఖ్య	పని వివరము	అంచనా మొత్తం	ఇఎండి	టెండర్ సెట్ వెల	పనిని పూర్తి చేయు కాలం	కాంట్రాక్టరు తరగతి
1	శ్రీ లక్ష్మి చెన్నకేశవ దేవస్థానం సంబంధించిన కడప బండలు పరచుటకు	రూ. 1,95,000/-	4,875/-	1000/-	3 నెలలు	5వ తరగతి

కె.వి.రమణ, కార్యనిర్వహణాధికారి, శ్రీ లక్ష్మి చెన్నకేశవ దేవస్థానం, కొర్రపాడు గ్రామం, ముద్దనూరు మండలం, కడపజిల్లా



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
కడప - C.O.: 99854 04960 పులివెందుల - S.R.: 95812 61647 D.C.M.: 99854 11184

జీఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా శాంతమ్మ

ముద్దనూరు జూన్26(ఆంధ్రజ్యోతి):స్థానిక జీఎన్ఎస్ఎస్ కార్యాలయం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా(ఎస్డీసీ) శాంతమ్మ ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టారు. ఆమె కడప జీఎన్ఎస్ఎస్-2లో రెగ్యులర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఎస్డీసీగా బాధ్యతలు నిర్వహించిన చిన్నయ్యను పులివెందుల రెగ్యులర్ ఆర్డీవోగా నియమించినట్లు అధికారులు తెలిపారు.

ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రూపానంద్

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రూపానంద్‌ను, టీఏస్ఆర్ఎంగా డాక్టర్ గోపాల్‌ను ప్రభుత్వం నియమించింది. గురువారం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు తీసుకున్న డాక్టర్ రూపానంద్‌ను ఏపీ హంసా జిల్లా అధ్యక్షుడు బండి రాజారత్నం, తాలూకా గౌరవాధ్యక్షురాలు సరళమ్మ, ఏపీ గెజిటెడ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ తాలూకా కార్యదర్శి రామచంద్రయ్య, డాక్టర్ కవిత, ఇతర సిబ్బంది ఘనంగా సత్కరించారు.

బస్‌షెల్టర్ నిర్మాణానికి నిధులు మంజూరు

దువ్వూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం నేలటూరు మెట్టువద్ద బస్‌షెల్టర్ నిర్మాణానికి రూ.5 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో షెల్టర్, టాయిలెట్ నిర్మాణానికి సంబంధించి గురువారం శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. జిల్లా జనరల్ ఫండ్ కింద ఈ నిధులు మంజూరైనట్లు పంచాయతీరాజ్ ఏఈ సుబ్రమణ్యం తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరి శ్రీనివాసులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చెక్‌డ్యాం పనులు ప్రారంభం



దువ్వూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు సమీపంలోని కేసీఆయకట్టు పరిధిలో గురువారం చెక్‌డ్యాం పనులు ప్రారంభించారు. రూ.9 లక్షలతో చేపట్టిన పనులు ప్రారంభోత్సవంలో కేసీ కాలువ ఏఈ పవన్‌కుమార్‌రెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు కోనేటి హరి, మండల కన్వీనర్ రమణారెడ్డి టెంకాయలు కొట్టి పనులు ప్రారంభించారు. రైతుల ప్రయోజనాల కోసం ఇక్కడ చెక్‌డ్యాం పనులు చేపట్టినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాంబాబు, వెంకటేశ్వరరెడ్డి, బాస్కర్‌రెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ

అట్లూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అట్లూరు మండలంలోని 22 రేషన్ షాపుల పరిధిలోని వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ డీలరు ద్వారా ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేశారు. గురువారం కొండూరు రేషన్‌షాపు పరిధిలోని వృద్ధులకు ఇంటి వద్దనే రేషను పంపిణీని తహసీల్దారు సుబ్బలక్షుమ్మ పరిశీలించారు.

పోరుమామిళ్లలో : మంచానికే పరిమితమైన వృద్ధులకు వారి ఇంటి వద్దకే డీలర్లు వెళ్లి రేషన్ పంపిణీ చేశారు. పోరుమామిళ్ల రెండో రేషన్‌షాపు డీలరు అల్లురయ్య తన పరిధిలో ఉన్న వృద్ధులందరికీ వారి ఇంటి వద్దకే వెళ్లి వేలిముద్రలు వేయించుకుని రేషన్ పంపిణీ చేశారు.

స్వచ్ఛందంగా పందుల తరలింపు

ప్రొద్దుటూరు అర్బన్ జూన్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరాములు అనే పందుల పెంపకం దారుడు స్వచ్ఛందంగా తన 50 పందులను పట్టణం నుంచి గురువారం తరలించారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ సి. రవిచంద్రారెడ్డి పందులను పట్టణం నుంచితరలించాలని పందుల పెంపకం దారుల ను ఆదేశించారు.

ఇదేనా..! స్వచ్ఛభారత్



పత్తూరు ఆయూష్మాన్ భవన్‌కు వెళ్లే దారిలో పేరుకుపోయిన చెత్తాచెదారం

ఖాజీపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్.. స్వచ్ఛంధ్ర.. స్వర్ణాంధ్ర అంటూ పరిశుభ్రత పెంపొందించాలంటూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సూచిస్తున్నా చాలా చోట్ల అవి మొక్కుబడిగా సాగుతున్నాయి. ఇందుకు నిదర్శనం ఖాజీపేట మండలం పంచాయతీ కేంద్రమైన పత్తూరు ఆయూష్మాన్ భవన్‌కు వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా చెత్తకుప్పలు పేరుకుపోయి అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. గ్రామాలు, పట్టణాల్లో చెత్తచెదారాలు లేకుండా పరిశుభ్రత పెంపొందించడానికి స్వచ్ఛభారత్ పథకం కింద కోట్ల రూపాయలు ఖర్చు పెడుతుంటే ఇలా పంచాయతీ కేంద్రాల్లోనే చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయంటే ఇక గ్రామాల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించవచ్చు. ప్రతినెలా మూడవ శనివారం స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నా చెత్తకుప్పలు పేరుకుపోతుండడం గమనార్హం. మండల స్థాయి అధికారులు కార్యాలయాల ముందు కొన్ని చోట్ల పిచ్చిమొక్కలు తొలగించడంతోపాటు ర్యాలీ చేపట్టి ఫొటోలకు ఫోజులివ్వడం వాటిని ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వానికి మేము ఇది చేశాం, అది చేశాం అంటూ పంపి కార్యక్రమం మమ అనిపించారు. దీంతో తహసీల్దార్ కార్యాలయం, బాలికోన్నత పాఠశాల ఆవరణాలతోపాటు దయాంఖాన్‌పల్లెకు వెళ్లే రహదారి చెత్తకుప్పలకు నిలయాలుగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త రహిత సమాజం కోసం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మహాగురుకులం ప్రారంభోత్సవానికి సన్నాహాలు

బ్రహ్మంగారిమఠం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):మండలంలోని తోట్లపల్లెలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహాగురుకులం పాఠశాల ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తున్నారు. గతంలో రూ.25కోట్లతో నిర్మాణ పనులు చేపట్టారు. అప్పటి నుంచి కొన్ని మౌళిక వసతులు లేకపోవడంతో రెండేళ్ల నుంచి పాఠశాలలో అడ్మిషన్లురాలేదు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కలెక్టరు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో త్వరగా పూర్తి చేయాలని సంబంధిత పంచాయతీరాజ్, ఎలక్ట్రికల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించి నిరుపేదల విద్యార్థులకు కార్పొరేట్‌తరహాలో విద్యను అందించాలన్నదే తన లక్ష్యమన్నారు.

మాకు న్యాయం చేయండి

శ్రీకొండాసింగరాయస్వామి భూముల్లో గత 30సంవత్సరాల నుంచి ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నామని ఇటీవల దేవదాయశాఖ అధికారులు ఉన్న పళంగా గృహాలు ఖాళీ చేయాలని అంటున్నారని తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌కు బాధితులు విన్నవించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే దేవదాయశాఖ అధికారులతో ఈ విషయంపై మాట్లాడి న్యాయం చేస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, మార్కెట్‌యార్డు ఛైర్మన్ ఏపీ రవీంద్ర, టీడీపీ మండల ఉపాధ్యక్షులు నరసింహగౌడ్, నారాయణ, పాల్గొన్నారు.

ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడికి ఘన సన్మానం



ప్రొద్దుటూరు టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జీవోనెం.5ను సవరించి సచివాలయ ఉద్యోగులకు మండలంలోని వార్డు నుంచి వార్డుకు బదిలీ చేయడానికి అవకాశం లభించిన సందర్భంగా సచివాలయ ఉద్యోగులు ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డిని ఘనంగా సత్కరించారు. గురువారం ఎన్జీవో హోంలో సచివాలయ ఉద్యోగుల సమావేశం సందర్భంగా సచివాలయ ఉద్యోగుల సమస్యలు, బదిలీలు, పదోన్నతులపై చర్చించారు. ఈ సందర్భంగా కేజే రఘురామిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయ ఉద్యోగులను వార్డు నుంచి మరో వార్డుకు బదిలీ చేయడానికి ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంతగానో కృషి చేశారని ఆయన కృషి వలన ప్రభుత్వం సుముఖత తెలిపిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సహాధ్యక్షుడు సదాశివయ్య యాదవ్, ఉపాధ్యక్షులు శివరామానుజ. మధు, జాయింట్ సెక్రటరి రాజశేఖర్, నాగార్జున, ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రభుంజన్‌రెడ్డి, దీప్తి, సచివాలయ ఉద్యోగుల నాయకులు కిరణ్, పట్టణాధ్యక్షుడు వెంకటనారాయణ, దేవమణి, పరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ

ప్రొద్దుటూరు రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండల పరిధిలోని చౌడూరు, కాకిరేని ప్రాంతాలకు 1958 జీవాలకు నట్టల నివారణ మందులను తాపించినట్లు చౌడూరు పశువైద్యాదికారి డాక్టర్ ఆర్.దస్తగిరమ్మ తెలిపారు. గురువారం చౌడూరులో చేపట్టిన ఉచిత పశువైద్య శిబిరంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చౌడూరు పశువైద్య సిబ్బంది, గొర్రెల కాపరులు పాల్గొన్నారు.

కార్మికులకు జీవో 36 ను అమలు చేయాలి

ప్రొద్దుటూరు జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీవో 36ను అమలు చేసి రూ. 26వేల ప్రకారం జీతాలు ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు అర్థనగ్న ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు చాలీచాలని జీతాలతో ఎలా జీవనం సాగిస్తారో అధికారులే తెలపాలన్నారు. నేటి ధరలకు అనుగుణంగా ఇంజనీరింగ్ కార్మికులకు రూ. 26000 జీతం పెంచాలన్నారు. .కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకు లు వెంకటేష్ బిటెక్ శివ తదితరులు పాల్గొన్నారు.

టీబీ ఇంటింటి సర్వే పరిశీలన

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి నుంచి విముక్తి కల్పించడానికి టీబీముక్త భారత్‌లో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వేను వైద్యురాలు డాక్టర్ హిమబిందు పరిశీలించారు. గురువారం వైఎంఆర్ కాలనీ అర్బన్ హెల్త్‌సెంటర్ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సర్వేను వైద్యాధికారి హిమబిందు పరిశీలించి మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. రెండు వారాల నుంచి దగ్గు వస్తున్నా, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, వంటి లక్షణాలు ఉన్నవారు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్షయవ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచితంగా ఆరు నెలలు మందులు ఇస్తుందని తెలిపారు.

టీడీపీ బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బాగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పార్టీ కార్యాలయంలో అబ్జర్వర్లు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ రానున్నస్థానిక సంస్థల ఎన్నికల్లో మండలాలు, గ్రామాల్లో అబ్జర్వర్లతో కలిసి కార్యాచరణను ముందుకు తీసుకెళ్లి పార్టీకోసం బాగా పనిచేయాలన్నారు.అనంతరం జమ్మలమడుగు నియోజకవర్గానికి అబ్జర్వర్లుగా టీడీపీ అధిష్టానం నియమించినవారికి సన్మానం చేశారు. వారు భూపేశ్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, మార్కెట్‌యార్డు ఛైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు మద్దూరి రామకృష్ణ, ఎన్నికల అబ్జర్వర్లు దుద్యాల అనితాదీప్తి, హరిప్రసాద్‌నాయుడు, నియోజకవర్గ మండలాల అబ్జర్వర్లు , క్లస్టర్, యూనిట్ బూత్ ఇన్‌చార్జిలు, పార్టీ అనుబంధ కమిటీ సభ్యులు, నాయకులు కర్నాటి రామాంజనేయరెడ్డి, లక్ష్మణనాయుడు, బీర్రు సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయండి

కలసపాడు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి అందరు కలిసికట్టుగా పనిచేయాలని కడప పార్లమెంట్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు, కలసపాడు మండల పరిశీలకుడు ఖాదర్‌బాష పేర్కొన్నారు. గురువారం టీడీపీ కార్యాలయలో బూత్ కన్వీనర్ల సంస్థాగత ఎన్నికల సమావేశం నిర్వహించారు. టీడీపీ మడల అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి అధ్యక్షతన సమావేశంలో ఖాదర్‌బాష మాట్లాడుతూ ప్రతి కార్యకర్త గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి ప్రత్యేకశ్రద్దతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ మార్కెట్ యార్డు ఛైర్మన్ సాధనకారి రంతు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలిరెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు పట్టాభిరెడ్డి, యువత నాయకులు శ్రావణ్‌కుమార్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, దుగ్గిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రామసుబ్బయ్య నీటిసంఘం అధ్యక్షులు, మాతః సర్పంచులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను అడ్డుకున్న అధికారులు

బద్వేలు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణంలోని అంబేద్కర్ భవనం సమీపంలో రహదారిని సైతం ఆక్రమించుకుని అక్రమ కట్టడాలను నిర్మిస్తుండగా ఆర్డీవో చంద్రమోహన్ ఆదేశాల మేరకు తహశీల్దారు ఉదయ భాస్కర్ రాజు సిబ్బందితో వెళ్లి నిలుపుదల చేశారు. మున్సిపాలిటీ పరిధిలో కొన్ని వార్డులలో రహదారులు , మున్సిపాలిటీ కాలువలు సైతం ఆక్రమించుకుని కొంతమంది భవనాలు నిర్మించుకున్నారని వాటిని కూడా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టిసారించి అక్రమ నిర్మాణాలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రొద్దుటూరు , జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు రైల్వే స్టేషన్ సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి గంజాయి విక్రయిస్తూ పట్టుబడినట్లు ఎక్సైజ్ సీఐ సురేంద్ర రెడ్డి తెలిపారు. గురువారం సీకె దిన్నె మండలం మామిళ్ల పల్లిగ్రామానికి చెందిన రామాంజనేయులు అనే వ్యక్తి ప్రొద్దుటూరులో పలు కాలేజీల విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని గంజాయి విక్రయాలు సాగిస్తున్నాడన్నారు. ఇతని వద్ద నుంచి 1. 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

ప్రతి ఉద్యోగికి బదిలీ సర్వసాధారణం

కలసపాడు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగికి బదిలీ సర్వసాధారణమని పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం కలసపాడు పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడ పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న కానిస్టేబుళ్లు రవితేజ, శ్రీనివాసులు, మెయినుద్దీన్, ఓబులేసు, రామాంజనేయులును శాలువా పూలమాలలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ తిమోతి, సిబ్బంది పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో :బదిలీపై వెళుతున్న కానిస్టేబుళ్లను సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డిలు సన్మానించారు. పోరుమామిళ్ల పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుళ్లుగా పనిచేసిన ఇద్దరు బద్వేలుకు, రాజశేఖర్ బి.కోడూరుకు మరోక కానిస్టేబుల్ మరో చోటకు బదిలీ అయ్యారు.

ఎంఈవోలకు సన్మానం: పోరుమామిళ్ల ఎంఈవోలు కాశయ్య, అంకిరెడ్డిలను ఎస్టీయూ, ఏపీటీఎఫ్, ఏపీఈఎస్ ఉపాధ్యాయసంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. ఎంఈవో కొండిశెట్టి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘ నాయకులు మాట్లాడుతూ పనిచేసిన తక్కువ కాలంలోనే అటు అధికారుల, ఇటు ఉపాధ్యాయుల మన్ననలు పొందారన్నారు. పుల్లయ్య వెంకట్రామిరెడ్డి, భూపాల్‌రెడ్డి, అబ్దుల్‌సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

మైదుకూరు రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమ్మవారిశాల వద్ద ఏర్పాటు చేసి సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్తుతో కుటుంబాలు చిత్తుచిత్తు అవుతున్నాయన్నారు. నియోజకవర్గంలో ఎక్కడైన గంజాయి, డ్రగ్స్ లాంటి మాదకద్రవ్యాలు ఉన్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. తరువాత స్థానిక స్త్రీ శక్తి భవనంలో 39 మంది ఆర్‌పీలకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. అలాగే మండలంలోని శివపురంలో రైతులకు వ్యవసాయశాఖ అధికారుల సమక్షంలో జీలుగలను, 80 శాతం సబ్సిడీలతో పంటలకు మందులను పిచికారి చేయడానికి డ్రోన్‌లను ఎమ్మెల్యే అందించారు. అవదూత పుల్లయ్యస్వామి తిరుణాల సందర్భంగా ఆలయం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఏపీ రవీంద్ర, మున్సిపల్ ఛైర్మన్ మాచనూరు చంద్ర, పట్టణ ఉపాధ్యక్షుడు యాపరాల లక్ష్మీనారాయణ, యూనిట్ ఇన్‌చార్జ్‌లు తుపాకుల రమణ, బండి అమర్‌నాథ్, సీఐ రమాణారెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో మల్లేష్ మాజీ సర్పంచ్ శీర్ల నాగమోహన్, ఆలయ నిర్వాహకుడు హజరత్ రెడ్డి పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలి



జమ్మలమడుగు పాతబస్టాండ్ గాంధీ విగ్రహం వద్ద మానవహారం చేస్తున్న అధికారులు, విద్యార్థులు

జమ్మలమడుగు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వరరావు, పలువురు న్యాయవాదులు సూచించారు. గురువారం సాయంత్రం జమ్మలమడుగు పట్టణంలో మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత బస్టాండు గాంధీ విగ్రహం వద్ద మానవహారం చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐలు లింగప్ప, గోపాల్‌రెడ్డి, ఎస్ఐలు హైమావతి, రామకృష్ణ, సుబ్బారావు, తదితరులు వారి సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ పి.భావన

ప్రొద్దుటూరుటౌన్/రూరల్‌లో: యువత ఉజ్వల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ పి.భావన పేర్కొన్నారు. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వాడుక, రవాణా, వ్యతిరేక నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ వలన శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడంతోపాటు ఆర్థికంగా ఎంతో నష్టం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రూపానంద్, ఎక్సైజ్ అడిషనల్ సూపరింటెండెంట్ వినోద్, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ సభ్యుడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, విద్యార్థులున్నారు.

మత్తు పదార్థాలకు బానిసైతే జీవితం అంధకారంలోకి నెట్టబడి భవిష్యత్తు చిత్తవుతుందని కామనూరు పీహెచ్‌సీ వైద్యాదికారి డాక్టర్ హనీఫ్‌బాబా పేర్కొన్నారు. గురువారం అంతర్జాతీయ మారకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాలలో ర్యాలీ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ యువత మారక ద్రవ్యాలకు దూరంగా ఉండి జీవితంలో సంతోషంగా గడపాలని పేర్కొన్నారు. ఎ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, ఆప్తాల్మిక్ అధికారి తేజ, ఆరోగ్య సిబ్బంది, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు బానిసలు కావద్దు



నాలుగురోడ్ల కూడలిలో మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బద్వేలుటౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని సీఐలు రాజగోపాల్, నాగభూషణం, పేర్కొన్నారు. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురష్కరించుకొని బద్వేలులో అధికారులు, విద్యార్థులు నాలుగు ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చెడు వ్యస నాలకు బానిసలు కావద్దని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌లు ఉదయ భాస్కర రాజు, త్రిభువన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, ఫారెస్ట్ అధికారులు, మున్సిప ల్, రెవెన్యూ సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు మెడికల్‌షాపు యాజమాన్యం పాల్గొన్నారు.



నాలుగురోడ్ల వద్ద మానవహారం ఏర్పడిన దృశ్యం

ఎర్రగుంట్లలో: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ నరేష్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జడ్పీహైస్కూల్ నుంచి నాలుగు రోడ్ల వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి మత్తుపదార్థాల విముక్తికైనినాదా లు చేశారు. కార్యక్ర మంలో కల మల్ల ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐలు, ఉపాధ్యా యులు, విద్యార్థులు, డ్వాక్రా మహిళలు, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ముద్దనూరులో:యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ విస్నీలత పేర్కొన్నారు.అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో : విద్యార్థులు యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి, ఎంఈవో కొండిశెట్టి ప్రభుత్వజూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డి అన్నారు. గురువారం పోరుమామిళ్లలో మత్తుపదార్థాల వ్యతిరేక దినోత్సవ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నగరి భైరవ ప్రసాద్, కొండా రామక్రిష్ణరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ చెరుకూరి చెన్నరాయుడు, ఎంపీటీసీ కల్వకూరి రమణతో పాటు ప్రజాసంఘాల నాయకులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటిక కోసం స్థలం పరిశీలన



శ్మశాన స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

రాజుపాలెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): టంగుటూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలోని శ్మశాన వాటిక కోసం గురువారం జమ్మలమడుగు రెవెన్యూ డివిజనల్ అధికారి సాయిశ్రీ స్థలాన్ని పరిశీలించారు. ఈ శ్మశాన వాటిక కోసం ఆ గ్రామానికి చెందిన రైతు ఒక ఎకరా 13 సెంట్లు భూమి ఇస్తామని తెలపడంతో ఆ మేరకు ఆర్డీవో స్థానిక తహసీల్దారు వెంకటేశ్వర్లుతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. అనంతరం చౌక దుకాణం పరిశీలించి వృద్ధులకు ఇంటి వద్దకే నిత్యావసరాలు అందిస్తు న్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సాధికారతతో స్వపరిపాలన సాధ్యం



శిక్షణ తరగతులలో మాట్లాడుతున్న జడ్పీడిప్యూటీ సీఈవో సుబ్రమణ్యం

ప్రొద్దుటూరు రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించి వారి నాయకత్వం, సాధికారికతతో సుపరిపాలన సాధ్యమవుతుందని జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్రమణ్యం పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌సంస్థ ఆధ్వర్యంలో మహిళా నాయకత్వంలో మార్పు, స్థానిక సుపరిపాలనలో సాధికారికతపై మహిళా సర్పంచులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ మహిళా సర్పంచులకోసం, ప్రభుత్వం చేపట్టిన శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొదటి రోజు శిక్షకులు శివారెడ్డి, గంగులయ్య, సుబ్బరాయుడు వివిధ అంశాలపైన శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి ఆయా మండలాలకు చెందిన మహిళా సర్పంచులు హాజరయ్యారు.

బిల్లులు వెంటనే చెల్లించండి

మైదుకూరు రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీలో గతంలో చేసిన వర్కులకు బిల్లులు వెంటనే చెల్లించాలని కౌన్సిలర్లు మండిపడ్డారు. స్థానిక మైదుకూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గురువారం జరిగింది.ఈ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్లు రాధాక్రిష్ణ,బీఎస్ నాగేశ్వరిలు మాట్లాడుతూ వార్డులలో సమస్యలను అధికారుల పట్టించుకోవడం లేదంటూ వాపోయారు. కమిషనర్ శ్రీనివాసులరెడ్డి, ఛైర్మెన్ మాచనూరు చంద్ర, వార్డు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

జమ్మలమడుగు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళాలో 14 కంపెనీల వారు హాజరవుతారన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరు జాబ్‌మేళాకు హాజరుకావాలని ఆయన కోరారు.

